ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 93 బుధవారం 18 - 03 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 93 Wednesday 18 - 03 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## జగ్గారెడ్డికి పీసీసీ
# అధ్యక్ష పదవి ఇవ్వాలి

- జగ్గారెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- జగ్గారెడ్డి ఎప్పుడూ ప్రజల్లో ఉండే మాస్ లీడర్ అన్న మంత్రి
- జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయన్న మంత్రి
- ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటారన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- జగ్గారెడ్డి మరో పీజేఆర్ అని కితాబు
- అసెంబ్లీ లాబీ ఇష్టాగోష్టిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 17 :**
కాంగ్రెస్ పార్టీ అంటేనే స్వేచ్ఛారాజకీయాలకు మారుపేరు అనే నానుడి ఉంది. దానికోసం ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు. ఆ పార్టీ నాయకులే అప్పుడప్పుడు బయటపెడుతుంటారు. అదే దిశగా ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.ఎప్పుడూ జనంలో ఉండే జగ్గారెడ్డి మాస్ లీడర్ అని, ఆయనను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా చేయాలని రోడ్లు, భవనాల శాఖ - మిగతా 2 లో

## మహిళా సంఘాలకు
# వడ్డీలేని రుణాలిచ్చాం


2 లో

- మంత్రి సీతక్క
- వడ్డీలేని రుణాలు రూ.57వేల కోట్ల రుణాలిచ్చామన్న సీతక్క
- మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్
- మాటకు కట్టుబడి కేటీఆర్ రాజీనామా చేయాలి
- మహిళలను ఎదగనివ్వాలనే ఆలోచన కేటీఆర్‌కు లేదన్న సీతక్క
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి


2 లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ

- దానం నాగేందర్ తమ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొంది, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారన్న కేటీఆర్
- కాంగ్రెస్ పార్టీ వచ్చాక బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయన్న కేటీఆర్
- ఏ గ్రామంలో అయినా సంపూర్ణ రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్

## శ్రీలంకలో భారత పర్యాటకుల కోసం యూపీఐ సేవలు విస్తృతం

- ఇకపై శ్రీలంకలో ఫోన్‌తోనే సులభంగా చెల్లించవచ్చు!
- శ్రీలంకలో భారత పర్యాటకుల కోసం యూపీఐ సేవలు విస్తృతం
- లంకా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లించే సౌకర్యం
- నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- భారత్-శ్రీలంక మధ్య ఆర్థిక బంధాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు



2 లో


2 లో

## అమెరికాతో రాజీకి నో
# ప్రతీకారానికే మొగ్గు

- ఇరాన్ కొత్త సుప్రీం లీడర్
- అమెరికా సంధి ప్రతిపాదనలను తిరస్కరించిన ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ
- తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని తీవ్ర హెచ్చరిక
- శత్రువుల నుంచి పరిహారం వసూలు చేస్తామని ప్రకటన
- ఫిబ్రవరి 28 దాడిలో మొజ్తబా తీవ్రంగా గాయపడినట్లు కథనాలు

## మూడేళ్లలో పేదల సొమ్ము 19 వేల కోట్లను దోచుకున్న బ్యాంకులు

- ఎంపీ రాఘవ్ చద్దా
- బ్యాంకుల మినిమం బ్యాలెన్స్ దోపిడిపై పార్లమెంట్ వేదికగా రాఘవ్ చద్దా ఆగ్రహం
- కూలీలు, రైతులు, పెన్షనర్ల కష్టాన్ని బ్యాంకులు దోచేస్తున్నాయని మండిపాటు
- పేదలకు అండగా నిలవాల్సిన బ్యాంకులు పెనాల్టీలు వేయడంపై ఆవేదన
- ఈ పెనాల్టీలను రద్దు చేయాలంటూ కేంద్రం,ఆర్బీఐని డిమాండ్ చేసిన రాఘవ్



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 17 :**
పార్లమెంట్ వేదికగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'మినిమం బ్యాలెన్స్' పెనాల్టీల అంశంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న ఈ నిశ్శబ్ద దోపిడీపై ఆయన అందించిన గణాంకాలు విస్తుగొలుపుతున్నాయి.బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) లేదనే నెపంతో గత మూడేళ్లలో బ్యాంకులు ఏకంగా రూ.19 వేల కోట్లు వసూలు చేశాయని రాఘవ్ చద్దా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారీ మొత్తం అపర కోటీశ్వరుల - మిగతా 2 లో

## గుండె ధైర్యమే
# వైసీపీ ట్రేడ్ మార్క్

- వైసీపీ అధినేత జగన్
- జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడనే చర్చ జరుగుతోందిజగన్
- ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో జగన్ భేటీ
- గుండె ధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని ఉద్ఘాటన
- వైసీపీ పాలనకు, బాబు పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్య



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 17 :**
తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు ఒంగోలు నియోజకవర్గ కేడర్‌తో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వంపై తన విమర్శనాస్త్రాలకు మరింత పదును పెట్టారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని... విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని ఆయన అన్నారు.తమ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య - మిగతా 2 లో

## ఏపీలో గ్యాస్ కొరత లేదు
# ప్రజలు ఆందోళన చెందవద్దు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రంలో ఎల్పీజీ పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రస్తుతం 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని వెల్లడి
- సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టాలని అధికారులకు ఆదేశం
- ప్రపంచ సంక్షోభాల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా
- కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా అందించేందుకు ప్రణాళికలు
- మరో 15 రోజులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని సీఎం వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 17 :**
ఇరాన్ యుద్ధం నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు, సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గ్యాస్ కొరతపై ఊహాగానాలు వస్తుండడం పట్ల ఆయన అధికారులతో చర్చించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని, మరో 15 రోజులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని సీఎం వెల్లడించారు. అమరావతిలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు గ్యాస్ కొరత రాకుండా నిరంతరాయంగా సరఫరా చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఇండక్షన్ స్టవ్‌ల ఉత్పత్తి, పంపిణీని పెంచి వాటి లభ్యతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదే సమయంలో, సిటీ గ్యాస్ - మిగతా 2 లో

## తప్పు రిపీట్ అయితే
# కఠిన చర్యలు తప్పవు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- మైలవరం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నారా లోకేశ్
- మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలన
- తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక
- యుద్ధప్రాతిపదికన సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థ ఏర్పాటుకు ఆదేశాలు
- వారానికోసారి ఎమ్మెల్యేలు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచన



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 17 :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పు పునరావృతం అయినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. చిన్న సమస్య ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ఈ పవిత్ర బాధ్యతను - మిగతా 2 లో

# సంపాదకీయం

## కత్తిదించు ట్రంప్.. ఎత్తు శాంతి పతాక!

ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌లు నిర్హేతుకంగా ప్రారంభించిన యుద్ధం బాధిత దేశాన్ని ధ్వంసం చేస్తోంది. పశ్చిమాసియా అంతటా అల్ల కల్లోలం సృష్టిస్తోంది. ఆ యుద్ధ ప్రభావాలు ఇరాన్‌కు, పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కావడం లేదు. దాని పర్యవసానాలు సమస్త దేశాలనూ సమస్యల సుడిలోకి నెట్టివేస్తున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికాఇజ్రాయెల్ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో ఇరాన్‌లో అపార ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించింది. అయితే ఆ దేశం ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు, శత్రువుకు లొంగలేదు. యుద్ధ విషమ పరీక్షలో ఇరాన్ ఓడిపోలేదు. అయతొల్లా ఖమేనీతో సహా దేశ అగ్ర నాయకులు అందరూ యుద్ధం మొదటి రోజునే హతమయ్యారు. కొంత పెనుగులాటతోనే ఇరాన్ కొత్త అధినేతను ఎన్నుకున్నది.. సైనిక శ్రేణులకు కొత్త నాయకులను నియమించింది. కొత్త అధినేతను, సైనికాధికారులనూ తుదముట్టిస్తామని అమెరికా ఇజ్రాయెల్ ప్రకటించాయి. టెహ్రాన్, సనాందాజ్, ఇస్ఫహాన్ తదితర ప్రధాన నగరాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇంతవరకు దాదాపు 1300మంది ఇరానియన్లు హతమయ్యారు, పదివేల మంది గాయపడ్డారు. అమెరికన్ క్షిపణి ఒకటి ఒక పాఠశాలను భస్మీపటలం చేసింది. ఈ భయానక ఘటనలో 168 మంది బాలలు, 14 మంది ఉపాధ్యాయులు మాడి మసైపోయారు. ఆ చిన్నారులు చేసిన నేరమేమిటి? వారి గురువులు పాల్పడిన పాపమేమిటి?ఇరాన్‌లో సంభవించిన విధ్వంసాన్ని రేఖామాత్రంగా పేర్కొంటాను: క్షిపణి ప్రయోగ వేదికలు, సైనిక దళాల స్థావరాలు, నౌకాదళ ఆస్తులు, వాయుతల రక్షణ కేంద్రాలు, ఉత్పత్తి సదుపాయాలు; గృహాలు, పాఠశాలలు, ఆస్పత్రులు; చమురు నిల్వ కేంద్రాలు (ఇవి ఇంకా భగభగ మండుతూనే ఉన్నాయి); నీటి సరఫరా కేంద్రాలు మొదలైన ప్రాథమిక పౌర సదుపాయాలు; ముప్పులో పడిన ప్రజారోగ్యం; కనీవినీ ఎరుగనిరీతిలో పర్యావరణ విధ్వంసం.ఇరాన్‌లో పాలనా వ్యవస్థ స్వభావాన్ని పక్కన పెట్టి ఇరానియన్ల యోగక్షేమాలపై మన దృష్టిని కేంద్రీకరిద్దాం. ఇంత భయంకర విధ్వంసానికి లోను చేసేందుకు వారు చేసిందేమిటి? ఇజ్రాయెల్ ప్రోత్సాహంతో యుద్ధానికి దిగిన అమెరికా.. ఇరాన్‌పై చేసిన ఆరోపణల్లో నిజమెంత? ఇరాన్ పెద్ద ఎత్తున శుద్ధిచేసిన యురేనియంను నిల్వచేసుకుందని, అణ్వస్త్రాల అభివృద్ధిని దాదాపుగా పూర్తి చేసిందని అమెరికా ఆక్రోశించింది. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇరాన్‌తో చర్చలకు అమెరికా పూనుకున్నది. అయినా యుద్ధం ప్రారంభమయ్యే సూచనలను పసిగట్టిన ఒమన్ విదేశాంగమంత్రి వాషింగ్టన్‌కు వాయువేగాన వెళ్లి 'శుద్ధి చేసిన యురేనియంను నిల్వ చేసుకోకుండా ఉండేందుకు' ఇరాన్ అంగీకరించిందని, అలాగే ఎట్టి పరిస్థితులలోనూ 'అణ్వస్త్రాల తయారీకి పూనుకోబోమని' కూడా ఇరాన్ హామీ ఇచ్చిందని సవివరంగా నివేదించారు. అయినా ఒమన్ మాటను ట్రంప్ ఖాతరు చేయలేదు. ఇరాన్ హామీలను తోసిపుచ్చారు.. ఖతార్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న చర్చలను నిలిపివేసి, ఇరాన్‌పై యుద్ధదాడులకు ఆదేశించారు.ఇజ్రాయెల్ విస్తరణవాదానికి ఇరాన్ ఒక పెద్ద అవరోధం కావచ్చు కానీ, అమెరికాకు ఇరాన్ ఏ విధంగానూ ముప్పు కాదు. 2025 జూన్‌లో ఇరాన్‌కు వ్యతిరేకంగా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట అమెరికా న్యాయ విరుద్ధమైన దాడులు నిర్వహించింది. ఆ దాడుల అనంతరం 'ఇరాన్‌లో యురేనియం శుద్ధి సదుపాయాలను పూర్తిగా నిర్మూలించినట్టు' అమెరికా ప్రకటించింది. మరి మిడ్‌నైట్ హ్యామర్‌లో ఆ విధంగా నష్టపోయిన తరువాత కూడా ఇరాన్ ఎలా అణ్వస్త్రాలను అభివృద్ధి చేసుకున్నది? అవి ఎక్కడ ఉన్నాయి? వాటి విషయమై ఐక్యరాజ్యసమితికి ఒక నివేదిక సమర్పించాలని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు అమెరికా విజ్ఞప్తి చేసిందా? అలా విజ్ఞప్తి చేయడం అమెరికా నైతిక బాధ్యత కాదా? అయినా.. ఏ దేశం అణ్వస్త్రాలను కలిగి ఉండాలి, ఏ దేశం ఆ మారణాయుధాలను కలిగి ఉండకూడదని నిర్ణయించే, నిర్దేశించే అధికారం అమెరికాకు ఎక్కడుంది? భారత్, పాకిస్థాన్, ఉత్తర కొరియాలలో కూడా జోక్యం చేసుకుని ఆయా దేశాల అణ్వస్త్రాల తయారీ సామర్థ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు కూడా అమెరికా నిర్ణయం తీసుకుంటుందా?పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు శత్రువులు ఉన్నారు. పాలస్తీనియన్ల భూ భాగాలలో 1948లో ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేసినప్పుడే ఆ శత్రుత్వం ప్రజ్వరిల్లింది. అయినప్పటికీ కాలక్రమంలో ఇస్లామిక్ దేశాలతో సహా సమస్త ప్రపంచమూ ఇజ్రాయెల్ ఉనికిని గుర్తించింది. పాలస్తీనా విభజన ప్రణాళిక (1947)కు వ్యతిరేకంగా భారత్ ఓటు వేసినప్పటికీ 1950 సెప్టెంబర్‌లో ఇజ్రాయెల్‌ను అధికారికంగా గుర్తించింది. 1992లో ఆ దేశంతో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను నెలకొల్పుకున్నది. వాణిజ్యం, సైనిక సహకారం, గూఢచర్య సమాచారం పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం తదితర విషయాలలో ఉభయ దేశాల మధ్య సంబంధాలు సుస్థిరంగా వర్ధిల్లుతున్నాయి. పశ్చిమాసియా వివాదాలు, సంఘర్షణల్లో భారత్ ఇప్పటివరకు సంయమన వైఖరితో వ్యవహరిస్తూ వస్తోంది. అయితే ఇటీవల భారత్ ఇజ్రాయెల్ పక్షపాతిగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది మార్చి 12న ఇరాన్‌ను మాత్రమే ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రతిపాదించిన తీర్మానానికి భారత్ మద్దతునిచ్చింది. షియా దేశాల కూటమికి, ప్రభవిస్తోన్న సున్నీ దేశాల కూటమికి వ్యతిరేకంగా భారత్, గ్రీస్, సైప్రస్, అరబ్, ఆఫ్రికన్, మధ్యధర సముద్ర తీరస్థ దేశాలు ఒక కూటమిగా ఏర్పడాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి ప్రతిపాదించినప్పుడు దానిపై భారత్ మాటమాత్రంగానైనా నిరసన తెలుపలేదు!ఇరాన్‌పై యుద్ధానికి పోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష్యాలు ఏమిటి? తొలుత 'ఇరాన్‌ను అణ్వస్త్ర రహితం చేయడం' అని ప్రకటించారు. ఆ తరువాత 'ఇరాన్ సైనిక సామర్థ్యాల సంపూర్ణ నిర్మూలన' అని నిర్దేశించుకున్నారు. పిదప, పాలనా వ్యవస్థ మార్పుగా ప్రకటించారు. ఇప్పుడు ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని ట్రంప్ గర్జిస్తున్నారు. 'మీ ప్రభుత్వాన్ని కూలదోయండి, దేశ పాలనను మీ చేతుల్లోకి తీసుకోండి, మీకు ఇదొక అవకాశం' అని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని ఇరానియన్లు ఏ మాత్రం పట్టించుకోనేలేదు.ట్రంప్ దుస్సాహసం ఫలితంగా చమురు ధరలు మిన్నంటాయి. బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైగా పెరిగింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెచ్చురిల్లుతోంది. అంతేనా? ట్రంప్ పాలన పట్ల అసంతృప్తి తీవ్రమవుతోంది. ఇరాన్ నియంత్రణలో ఉన్న హోర్ముజ్ జలసంధి ద్వారా ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోయాయి. మన దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడింది. ధరలు పెరిగిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి.

## ఏపీలో గ్యాస్ కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు

**మొదటిపేజీ తరువాయి –** డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తరించి, కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా ఇళ్లకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గృహ వినియోగానికి గ్యాస్ కొరత లేదని, సరఫరా సజావుగా సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు.

## గుండె ధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్

**మొదటిపేజీ తరువాయి –** కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు.జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## మూడేళ్లలో పేదల సొమ్ము 19 వేల కోట్లను దోచుకున్న బ్యాంకులు



**మొదటిపేజీ తరువాయి –** జేబుల నుంచి వచ్చింది కాదని, రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలు, రైతులు, తమ మందుల ఖర్చుల కోసం పైసా పైసా పోగేసుకునే పెన్షనర్ల కష్టార్జితమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ బ్యాంకులు రూ.11 వేల కోట్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు ఈ రూపంలో వసూలు చేశాయని దుయ్యబట్టారు.ఈ జరిమానాలను 'పేదరికంపై వేసిన పన్ను'గా ఆయన అభివర్ణించారు. ఒక సామాన్యుడు తన అత్యవసర ఖర్చుల కోసం అకౌంట్ ఖాళీ చేసినప్పుడు, అతనికి అండగా ఉండాల్సిన బ్యాంకులు రివర్స్‌లో వందల రూపాయల పెనాల్టీలు వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జన్ ధన్ ఖాతాలకు మినహాయింపు ఉన్నప్పటికీ, కోట్లాది మంది సామాన్య సేవింగ్స్ ఖాతాదారులపై ఈ భారం పడుతోందని ధ్వజమెత్తారు. ఈ పెనాల్టీలను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐని ఆయన డిమాండ్ చేశారు.

# తప్పు రిపీట్ అయితే కఠిన చర్యలు తప్పవు

**మొదటిపేజీ తరువాయి –** ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఓ పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు.మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన మంత్రి లోకేశ్, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. కొత్త కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు బదులిచ్చారు. వివాదం జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉండేదని కూడా మంత్రి ఆరా తీశారు. భోజనంలో ఏమైనా సమస్యలుంటే ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఇకపై భోజనం నాణ్యతపై 'లీప్' యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.



భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను పరిశీలిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు.అనంతరం అధికారులతో మాట్లాడిన మంత్రి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని గట్టిగా హెచ్చరించారు. "మీపై పవిత్ర బాధ్యత ఉంది. విద్యార్థులకు సంబంధించి చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, వెంటనే పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. భోజనం నాణ్యతపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలోని రికార్డులు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇటీవల మధ్యాహ్న భోజనంపై నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి గుర్తుచేశారు. సమూల మార్పుల కోసం రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామన్నారు. వారంలో ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.

# అమెరికాతో రాజీకి నో.. ప్రతీకారానికే మొగ్గు

**మొదటిపేజీ తరువాయి -** అమెరికాతో ఉద్రిక్తతలు తగ్గించుకోవాలంటూ మధ్యవర్తి దేశాల ద్వారా వచ్చిన సంధి ప్రతిపాదనలను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తబా ఖమేనీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునే విషయంలో ఆయన చాలా దృఢవైఖరితో ఉన్నారని ఓ ఇరాన్ సీనియర్ అధికారి 'రాయిటర్స్'కు వెల్లడించారు. తన నియామకం తర్వాత జరిగిన తొలి విదేశాంగ విధాన సమావేశంలో మొజ్తబా ఈ మేరకు స్పష్టమైన సంకేతాలిచ్చారు."రక్త ప్రతీకారాన్ని మేం మరిచిపోం. పూర్తి శక్తితో ప్రతిఘటిస్తాం. శత్రువుల నుంచి పరిహారం పొందుతాం లేదా అదే స్థాయిలో వారి ఆస్తులను ధ్వంసం చేస్తాం" అని మొజ్తబా ఖమేనీ హెచ్చరించినట్లు ఆ అధికారి తెలిపారు. ప్రతీకార చర్యలు ఇప్పటికే మొదలయ్యాయని, అవి పూర్తయ్యే వరకు తమ ప్రాధాన్యత అదేనని ఆయన స్పష్టం చేశారు.ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మొజ్తబా తండ్రి, అప్పటి సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. కువైట్ వార్తాపత్రిక అల్–జరీదా కథనం ప్రకారం, రష్యా అధ్యక్షుడు పుతిన్ చొరవతో మొజ్తబాను మెరుగైన చికిత్స కోసం మాస్కోకు తరలించారు. అయితే, ఈ వార్తలపై తాము స్పందించబోమని రష్యా తెలిపింది.ఇదిలా ఉండగా, తాజా దాడిలో ఇరాన్ సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, రెవల్యూషనరీ గార్డ్ బాసిజ్ ఫోర్స్ చీఫ్ జనరల్ ఘోలం రెజా సొలైమానీని చంపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, ఈ మరణాలను ఇరాన్ అధికారికంగా ధృవీకరించలేదు.



# శ్రీలంకలో భారత పర్యాటకుల కోసం యూపీఐ సేవలు విస్తృతం

**మొదటిపేజీ తరువాయి -** పొరుగు దేశమైన శ్రీలంకకు వెళ్లే భారతీయ పర్యాటకులకు చెల్లింపులు మరింత సులభతరం అయ్యాయి. శ్రీలంక వ్యాప్తంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూ×) సేవల అంగీకారాన్ని బలోపేతం చేస్తున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ విభాగమైన ఎన్ఐపీఎల్ మంగళవారం ప్రకటించింది. ఈ చొరవతో భారత పర్యాటకులు నగదుపై ఆధారపడకుండా తమ స్మార్ట్‌ఫోన్‌లతోనే డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలుగుతుంది. శ్రీలంక డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు.శ్రీలంక పర్యాటక రంగానికి భారత్ అతిపెద్ద వనరుగా ఉంది. 2024లో 4.16 లక్షల మంది భారతీయులు శ్రీలంకను సందర్శించగా, 2025 నాటికి ఆ సంఖ్య 5.31 లక్షలకు పెరిగింది. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సులభమైన, నమ్మకమైన చెల్లింపు పరిష్కారాలకు డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్ఐపీఎల్, శ్రీలంకకు చెందిన 'లంకాపే'తో కలిసి పనిచేస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం భారత పర్యాటకులు తమ యూపీఐ ఆధారిత యాప్‌ల ద్వారా అక్కడి 'లంకా క్యూఆర్' కోడ్‌లను స్కాన్ చేసి నేరుగా చెల్లింపులు చేయవచ్చు. ప్రస్తుతం ప్రధాన హోటళ్లు, రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్ల వద్ద ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.ఈ కొత్త విధానం వల్ల పర్యాటకులతో పాటు శ్రీలంక వ్యాపారులకూ ప్రయోజనం చేకూరనుంది. పర్యాటకులకు రియల్ టైమ్ చెల్లింపులు, పారదర్శకమైన మారకం రేట్లు, సుపరిచితమైన పేమెంట్ విధానం అందుబాటులో ఉంటాయి. అదే సమయంలో శ్రీలంక వ్యాపారులు భారత్‌కు చెందిన విశాలమైన డిజిటల్ కస్టమర్ బేస్‌ను ఆకర్షించడంతో పాటు నగదు నిర్వహణ భారాన్ని తగ్గించుకోవచ్చు.ఈ సందర్భంగా ఎన్ఐపీఎల్ ఎండీ, సీఈఓ రితేశ్ శుక్లా మాట్లాడుతూ.. "సరిహద్దు లావాదేవీలను సులభతరం చేయడం, దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాం. పర్యాటకం, ఆతిథ్యం, రిటైల్ వంటి కీలక రంగాల్లో యూపీఐ అంగీకారాన్ని పెంచి,

వ్యాపారులకు, పర్యాటకులకు మెరుగైన అనుభూతిని అందిస్తాం" అని తెలిపారు.భారత్ అభివృద్ధి చేసిన యూపీఐ వ్యవస్థను ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా అంతర్జాతీయ ద్రవ్య నిధి గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఇన్‌స్టంట్ చెల్లింపుల్లో దాదాపు 50శాతం వాటా యూపీఐదే కావడం విశేషం. ఈ తాజా చొరవ భారత్, శ్రీలంక మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# జగ్గారెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి –** మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జగ్గారెడ్డి మరో పీజేఆర్ అంతటి వారని మెచ్చుకున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటాడని కితాబిచ్చారు. జగ్గారెడ్డి తెలంగాణ పీసీసీ చీఫ్ అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవడం ఖాయమని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. టీపీసీసీ చీఫ్‌గా ఒకసారి ఎన్నికైతే 3 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం మహేశ్‌కుమార్ గౌడ్ టీపీసీసీగా వ్యవహరిస్తున్నారు.మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు : జగ్గారెడ్డి అసలు పేరు తూర్పు జయప్రకాశ్ రెడ్డి. ఈయన సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2018లో గెలుపొందారు. అంతకు ముందు బీజేపీ తరఫున మున్సిపల్ ఛైర్మన్‌గా రాజకీయం జీవితం ప్రారంభించి, తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి 2004లో, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో(2009) కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023లో జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి బరిలో దిగి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ చేతిలో ఓటమిపాలయ్యారు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ జగ్గారెడ్డి భార్య నిర్మల జగ్గారెడ్డికి టీజీఐఐసీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవిని ఇచ్చింది. ప్రస్తుతం ఆమె ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఒకవేళ ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా మంత్రి అయ్యేవారని విశ్లేషకులు గుర్తుచేస్తుంటారు. జగ్గారెడ్డి ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజు హల్‌చల్ చేశారు. పోలీసులపై బూతుపురాణంతో విరుచుకుపడ్డారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.జగిత్యాల కాంగ్రెస్‌లో మంటలు : మరోవైపు జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్‌లో మంటలు తారాస్థాయికి చేరినట్లు కనిపిస్తున్నాయి. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీ మారే దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాను పార్టీ మారాలని ఆలోచించేందుకు పూర్తి కారణం ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయేనని జీవన్‌రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు. ఎంత ఇబ్బంది ఉంటే పార్టీ మారాలని ఆలోచిస్తున్నానో అర్థం చేసుకోవాలని పార్టీ నాయకత్వానికి సూచించారు. కాంగ్రెస్‌తో తనది 40 ఏళ్ల బంధమని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తాను ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నానని చెప్పారు.2014లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తనకు ప్రజలు అవకాశం ఇచ్చారన్న జీవన్ రెడ్డి ప్రస్తుత శాసన సభ్యుడు సంజయ్ ఇక్కడి ప్రజల అభివృద్ధి హక్కును సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ వక్రమార్గాన పోతే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో హర్షించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని వదిలితే ఫ్లెక్సీలు ఏంటని, పూర్తిగా అన్నీ మారతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆఫీసు నుంచి కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడంపై ఈ కామెంట్స్ చేశారు. ఒకసారి కాంగ్రెస్ పార్టీని వీడితే తదుపరి ఏ పార్టీలో చేరాలో ఆలోచిస్తానని ఆయన వివరించారు.మున్సిపల్ పీఠం ఆయన వర్గానికే : బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో సంజయ్ చేరడాన్ని మొదటి నుంచి జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు పలు రకాల ఆరోపణలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పదవిని కూడా తన వర్గానికి ఇవ్వకుండా చేశారని బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలిచ్చాం

**మొదటిపేజీ తరువాయి –** స్వయం సహాయక సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలిస్తే రాజీనామా చేస్తానన్న కేటీఆర్.. ఇప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కేటీఆర్ అసెంబ్లీలో చెప్పిన తన మాటకు కట్టుబడి ఉండాలని సీతక్క గుర్తు చేశారు. బ్యాంకుల ద్వారా ఈ రెండు సంవత్సరాలల్లో మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చామని, మహిళా సంఘాల రుణాలపై వడ్డీ భారాన్ని కూడా భరిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల రుణాలపై ఇప్పటివరకు రూ.1,390 కోట్ల వడ్డీ చెల్లించామన్న మంత్రి బీఆర్ఎస్ హయాంలో వడ్డీలు ఎగ్గొట్టారని, అభయహస్తం నిధులు కాజేశారుని ఆరోపించారు. ఆధారాలు బయటపెట్టానని, లెక్కలు సరిచూసుకో అంటూ కేటీఆర్ ఉద్దేశించి, అసెంబ్లీ లాబీలో మంత్రి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.కేటీఆర్‌కు భట్టి, సీతక్క కౌంటర్ : ఇవాళ సభలో మహిళలకు వడ్డీలేని రుణాలపై మాటకు మాట చోటుచేసుకుంది. వడ్డీ లేని రుణాలపై గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదని కేటీఆర్ ఆరోపించారు. మహిళలకు 57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. దీనిపై స్పందించిన కేటీఆర్ రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని భట్టి విక్రమార్క, సీతక్క సమాధానం ఇచ్చారు.ఆడబిడ్డల డబ్బులు గుంజుకున్నారు : మహిళా సంక్షేమం గురించి కేటీఆర్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు."కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోంది. పదేళ్ల పాలనలో మహిళల కోసం బీఆర్ఎస్ ఏం చేసింది. రూ. 3 వేల కోట్ల వడ్డీలను మహిళలపై భారం మోపింది. ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసి ఆదా చేసుకున్న అభయహస్తం నిధులను గత ప్రభుత్వం కాజేసింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ



**మొదటిపేజీ తరువాయి –** దానం నాగేందర్ తమ పార్టీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొంది, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ స్పీకర్ ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని అన్నారు. తీర్పు తప్పుగా ఉన్నప్పటికీ, తాము స్పీకర్‌ను గౌరవిస్తున్నామని అన్నారు. పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ పార్టీ నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, బాల్క సుమన్‌లపై దాడులు జరిగాయని, హరీశ్ రావు క్యాంపు కార్యాలయం, తన క్యాంపు కార్యాలయంపై కూడా దాడులు జరిగాయని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 67 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ ఇచ్చింది 11 వేల ఉద్యోగాలే అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జాబ్ క్యాలెండర్ ఉత్తుత్తి క్యాలెండర్ అయిందని విమర్శించారు. ఏ గ్రామంలో అయినా సంపూర్ణ రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.ముఖ్యమంత్రి హార్వర్డ్ లో చాలా నేర్చుకున్నారని, ఆ ఖర్చును కూడా ప్రభుత్వమే భరించిందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంట్స్ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. గట్టిగా అడిగితే బెదిరింపులు తప్ప ఏమీ లేదని అన్నారు. ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక పెట్టలేదు కానీ కూల్చివేతలు మాత్రం జరుగుతున్నాయని అన్నారు. శారదా పీఠానికి ఇచ్చిన భూములు కూడా వదలడం లేదని అన్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

### మార్చి 29 ఇంద్ర పార్క్ ధర్నాకు కోదండరాం, నారాయణ మద్దతు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 17** : తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 29న హైదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ వేదికగా నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ , విద్య కమీషన్ మెంబెర్ విశేశ్వర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఏజెన్సీ వ్యవస్థ అనేది పూర్తిగా దోపిడీ వ్యవస్థగా మారిందని, ఈ వ్యవస్థలో రౌడీయిజం, గుండాయిజం తరహాలో మామూలు వసూళ్లు జరుగుతున్నాయని విమర్శించారు. అందువల్ల ఈ దళారీ వ్యవస్థను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ గారు మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమైనవని, వారి డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్నారు. ప్రభుత్వము వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోయిపడి శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు బాలకృష్ణారెడ్డి, క్రాంతికుమార్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు నిషేధించాలి

### రోజు చనిపోతున్న రైతులు

### వ్యవసాయ డైరెక్టర్ ను కోరిన జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 17** : కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు మూలంగా తెలంగాణలో రోజుకు అనేక మంది రైతులు చనిపోతున్నారని, దానిని తక్షణమే నిషేధించాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడ్డి మందు నిషేధంతో పాటు వ్యవసాయ మందుల షాపుల్లో వాటి విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కేఎస్ఆర్ సోమవారం తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు రైతుల పాలిట శాపంగా మారుతోందని, చిన్న చిన్న ఇబ్బందులతో మనస్థాపానికి గురైన వారు ఆవేశంతో దానిని తాగడం వల్ల వెంటనే మరణిస్తున్నారని, ఫలితంగా అనేక రైతు కుటుంబాలు ఆగమవుతున్నాయని ఆయన వివరించారు. గడ్డి మందు వల్ల తెలంగాణ వ్యాప్తంగా రోజుకు పదుల సంఖ్యలో రైతులు చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు వల్ల భూమి కూడా విషతుల్యం అవుతుందని వెంటనే దీనిని నిషేధించాలని కేఎస్ఆర్ గౌడ పేర్కొన్నారు. గడ్డి మందు నిషేధం కోసం చర్యలు తీసుకుంటామని, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని డైరెక్టర్ తెలిపారు. తమ పరిధి మేరకు తక్షణమే ఒక నెల రోజుల పాటు ముందు నిషేధానికి తాము చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి ప్రిస్క్రిప్షన్ మేరకు ముందును అమ్మడం కూడా సరికాదని, గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని కేఎస్ఆర్ తెలిపారు. గడ్డి ముందుకు ప్రత్యామ్నాయాలు చూడాలని కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 17 :** అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించి న్యాయం చేస్తాం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీపీఐ ఎమ్మెల్యే శ్రీ కూనంనేని సాంబశివరావు , ఎంఎల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలకు తాము మద్దతుగా నిలుస్తామని, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు నరసింహ , రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోయిపడి శ్రీధర్ , వర్కింగ్ ప్రెసిడెంట్లు బాలకృష్ణారెడ్డి, క్రాంతికుమార్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ ఫైనాన్స్ జరిగే మోసాలపై చర్యలు తీసుకోండి ...



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 17 :** శ్రీరామ్ ఫైనాన్స్ భువనగిరిలో 60 లక్షల రూపాయలు తీసుకోవడం జరిగిందని బాధితుడు కృష్ణ చైతన్య తెలిపారు సోమాజీగూడా ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ రామ్ ఫైనాన్స్ భువనగిరిలో 60 లక్షల రూపాయలు తీసుకోవడం జరిగిందని తెలిపారు శ్రీ రామ్ ఫైనాన్స్ లో 57 ,47,666 నాకు చెక్కు ఇచ్చారని దానికి ఈ మ శీ ఐ 60 నెలలుగా కట్టడం జరిగిందని ఆయన చెప్పారు మొత్తం ఇంట్రెస్ట్ తో కలిపి కోటి 9లక్షలు రూపాయలు చెల్లించాలని ఆయన తెలిపారు ఇప్పుడు 62 ,39,744 రూపాయలు కట్టాలని వేధిస్తున్నారని ఆయన తెలిపారు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ అంజిరెడ్డి నాకు లోన్ శాంక్షన్ చేసి 3 లక్షలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు శ్రీనివాస్ రెడ్డి వేధింపుల వల్ల నా గ్యారెంటరు సంతోష్ మృతి చెందారని ఆయన ఆరోపించారు శ్రీనివాస్ రెడ్డి బేధింపుల వల్ల గ్యారెంటర్ సంతోష్ మృతి చెందారని ఆయన ఆరోపించారు ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు ప్రభుత్వం తక్షణమే స్పందించి తనను ఆదుకోవాలని ఆయన ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు త్వరలోనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు

## ఎంపీ వద్దిరాజు ప్రముఖ కవి సిధారెడ్డికి శుభాకాంక్షలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 17** : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 మన తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి లభించడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిధారెడ్డికి ఎంపీ రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారి మానవాళిని వణికించిన సందర్భాన్ని సిధారెడ్డి తన దీర్ఘ కవిత "అనిమేష"ద్వారా వివరించిన తీరును అభినందిస్తూ కేంద్ర ప్రభుత్వం సాహిత్య పురస్కారాన్ని ప్రకటించిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన సిధారెడ్డి మనమందరం గర్వించదగ్గ గొప్ప కవి, రచయిత అని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు. మంజీరా రచయితల సంఘం ఏర్పాటు చేసి ఇతర సాహితీవేత్తలతో కలిసి తమ రచనలు, కవిత్వం ద్వారా ప్రజలలో చైతన్యాన్ని పాదుగొల్పారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన జరిగిన మహోద్యమంలో సిధారెడ్డి అగ్రభాగాన నిలిచారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సిధారెడ్డిని వరించడం ఆనందదాయకమని, ఇదేవిధంగా ఆయన మరెన్నో అవార్డులు అందుకోవాలని ఎంపీ వద్దిరాజు ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు, శుభాకాంక్షలు చెప్పారు

# రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం..

# ఉత్సవాలకు ముస్తాబైన సిర్సనగండ్ల ఆలయం.

### ఈనెల 26 నుంచి వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు



**అచ్చంపేట ప్రతినిధి, మార్చ్ 17 (వార్త సంధ్య):** శిరసనగండ్ల ఆలయ చరిత్ర నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని సిర్సనగండ్ల క్షేత్రం "అపర భద్రాద్రి"గా ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం. 14వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం, దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టపై వెలసింది. ఏటా చైత్రశుద్ధ్య పాడ్యమి నుంచి నవమి వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు, ఇది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.ం ఆలయ విశేషాలు ఈ ఆలయాన్ని 14వ శతాబ్దిలో నిర్మించబడినట్లు అక్కడ ఉన్న శిలాశాసనాల వల్ల తెలుస్తుంది. అప్పుడు ఈ ప్రాంతం భీకర అరణ్యంగా ఉండేదని, గుట్టపై దత్తాత్రేయ ఆశ్రమం, ముత్యాలమ్మ గుడి ఉండేవని స్థానికుల కథనం. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన రామయాజ్వికి శ్రీరాముడు కలలో కనిపించి భద్రాచలంలో ప్రతిష్ఠించాల్సిన సీతారామ విగ్రహాలు ఖమ్మం జిల్లా పాల్వంచ సమీపంలోని రావిచేడ్ గ్రామంలో ఒక పురోహితుడి ఇంటి పెరటిలో ఉన్నట్లు చెప్పినట్లు, ఆ విగ్రహాలు సకాలంలో భద్రాచలానికి చేరనందున వేరే విగ్రహాలు అక్కడ ప్రతిష్ఠించినట్లు, వాటిని సిర్సనగండ్లలో ప్రతిష్ఠించమని చెప్పినట్లు కథనం ప్రచారంలో ఉంది. కలలో శ్రీరాముడు చెప్పిన విధంగా పాల్వంచ సమీపంలోని విగ్రహాలు తీసుకొని వచ్చికోడికూత, రోకలిమోత వినిపించని సిర్సనగండ్ల గుట్టపై ప్రతిష్ఠించబడినట్లు, గుట్టపై కోనేరు కూడా నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ ఆలయం కల్వకుర్తి నుంచి దేవరకొండ వెళ్ళు రహదారిలో కల్వకుర్తి నుంచి 30 కిమీ దూరంలో ఉన్న చారకొండ నుంచి 5 కిమీ లోనికి ఉంది. ఏటా ఇక్కడ చైత్రశుద్ధ్య పాడ్యమి నుంచి నవమి వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దేరము జంబురాలు సిర్సనగండ్ల రామచరిత్రము అనే యక్షగానాన్ని రచించాడు.



ఒకప్పుడు ఈ ప్రదేశం దండకారణ్యమయిన ఈ ప్రాంతంగా ఉండేది. ఇక్కడ దత్తత్రేయ ఆశ్రమం ఉండేది. శ్రీరాముడు లక్ష్మణులు సీత దేవిని అన్వేషిస్తూ ఈ ఆశ్రమానికి వచ్చారు. అప్పుడు దత్తత్రేయుడు కోరిక మేరకు సీతారాములు అర్చావతార రూపంలో ఇక్కడ వెలవాలని నిర్ణయించుకున్నరు అని ప్రతీతి. దాదాపు 600 ల సంవత్సరాల క్రితం ఇక్కడ శ్రీ సీతారాములు వెలిసారని చరిత్ర. దాదాపు 300 అడుగుల ఎత్తులో, 70 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయం శోడశ స్తంభాలతో ఏకప్రాకారాలతో నిర్మితమైంది. ఇక్కడ రాచకొండ పద్మనాయకులు వేయించిన శిలాశాసనాలు కూడా ఉన్నాయి. అలాగే 4 పర్సియన్ భాశాతో శాసనలు ఉన్నాయి. ఇక్కడ ఆదిమానవుల శిలా యుగం నాటి ఆనవాళ్ళున్నాయి. ఈ ప్రాంతం క్రీస్తు శకం 13,14 శతబ్ధం నుంచి భాసిల్లింది అని చెప్పడానికి చాలా ఆధారాలున్నాయి "శిరుసనగండ్ల శ్రీసీతారామ శిరస్సు వంచి మొక్కుతా సరసనే నిలుచొని వరములిఇవ్వు" అంటూ భక్తులు కొండ ఎక్కుతూవుంటారు. ఇక్కడ సీతారామ కళ్యాణం చాలా అధ్భుతంగా నిర్వహిస్తారు. పెద్ద తేరు ఉత్సవం జరుగుతుంది. మూలవిగ్రహాలు శ్రీ సీతారామలక్ష్మణులు. ఇక్కడ రాముడు, లక్ష్మణులకు ఇరువురికి మీసకట్టు ఉండటం విగ్రహాల ప్రత్యేకం. ఈ విగ్రహాలు భద్రాచలంలో ప్రతిష్టించవల్సింవి అని, ఈ ఆలయ అర్చకుల పూర్వికులకు ఒకరికి స్వప్నంలో శ్రీరముడు కనిపించి నన్ను ఈ గుట్ట పై ప్రతిష్టించమని అన్నట్టు కథ. ఇక్కడా నవగ్రహాలు, రామలింగేశ్వరాలయం, శ్రీ హనుమన్ ఆలయం, ముక్కిడి పోషమ్మ, దత్తత్రేయ సన్నిధి, నాగసన్నిధి, రామకోటి స్థూపం, కల్యాణ మంటపం, గణపతి దేవుడు, అంబికా దేవి అను పలు ఉప ఆలయాలున్నయు. ఇది తెలంగణ రాష్ట్రంలో రెండవ భద్రాచలంగా పిలవబడుతుంది. ఈ క్షేత్రం రామాయణ గాథతో ముడిపడింది. సంవత్సరం పొడవునా కోట్ల మంది దర్శించుకుంటారు. నిత్యపూజలందుకుంటూ ధూపధీపాలతో సంవత్సరాంతం ఉత్సవాలు జరుగుతుంటాయి.

## జగిత్యాల జిల్లాలో నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త దారుణంగా కత్తితో దాడి చేసి చంపాడు



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ (వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్ కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి మాదాపూర్లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రెండు మూడు రోజులలో గ్యాస్ పంపిణీ

## సాధారణ పరిస్థితికి వస్తుంది మేనేజర్ గంజా కృష్ణ మోహన్.




**తిరువూరు, మార్చి 17(వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** తిరువూరు ఇండియన్ గ్యాస్ కంపెనీ మేనేజర్ గంజా కృష్ణ మోహన్ ఇటీవలి కాలం లో ఎదురైనా గ్యాస్ డెలివరీ పై వివరణ అందిచారు,ఇ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతు, తిరువూరు లోకల్ వారికి ఇంటింటికి గ్యాస్ సరఫరా చేస్తున్నాం,ఆన్లైన్ బుక్ చేసుకున్న వారికి ఆన్లైన్ బుకింగ్ అవటం లేదు అని ఆందోళన వద్దు ఒకేసారి అందరూ ఆన్లైన్ చేస్తూ ఉండడంతో సర్వర్ బిజీ అని వస్తుంది,దయచేసి సమయాన్ని పాటించండి అని, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతం వారికి మనవి మీకు ఏదో విధంగా విసులబాటు చేసుకునే అవకాశం ఉంటుంది కట్టు పుల్లలతో,టౌన్ లో పుల్లలతో అవకాశం ఉండదు కాబట్టి దయచేసి గ్రామీణ ప్రాంతం వారు గమనించి సహకరించగలరు అని అయన పెర్కొన్నారు.రెండు మూడు రోజులలో గ్యాస్ పంపిణీ సాధారణ పరిస్థితికి వస్తుంది.ఈ విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు,గృహ వినియోగ గ్యాస్ ను వ్యాపార అవసరాలకు వినియోగించ వద్దు దయ చేసి ప్రతి ఒక్కరూ సహకరించాలని అయన మానవి చెసారు.

## వావిలాల గ్రామంలో పశువులకు నిరోధక టీకాలు.



**తిరువూరు, మార్చి17 (వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం:** తిరువూరు మండలం వావిలాల గ్రామం నందు పశు వైద్యులు అభిలాష్ ఆధ్వర్యంలో గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 450 గేదెలకు,20 ఆవు, దూడలకు టికాలు వేసినట్లు అభిలాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాసరావు,రామారావు, నాగేంద్రబాబు,సందీప్,సాగర్,వెంకటేశ్వరరావు,విజయ్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చీకోడ్‌లో రంజాన్ సేవా కార్యక్రమం



**దుబ్బాక ప్రతినిధి మార్చి 17(వార్త సంధ్య ) సిద్దిపేట జిల్లా :** దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలో రంజాన్ సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించబడింది. మాజీ ఎంపీటీసీ లచ్చమ్మ గారి రామ్ రెడ్డి గ్రామంలోని ముస్లిం సోదరులకు సేమియాలు మరియు చెక్కర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని ప్రతిబింబించింది.

## సర్వేయర్ లేక రైతులకు ఇబ్బందులు

### సారంగాపూర్ మండలానికి శాశ్వత సర్వేయర్ నియామకానికి జిల్లా కలెక్టర్ కు సర్పంచ్ విజ్ఞప్తి



**సారంగాపూర్ మండలం వార్త సంధ్య మార్చి 17 :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో సర్వేయర్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ తెలిపారు. భూముల కొలతలు సక్రమంగా జరగకపోవడం వల్ల భూ వివాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇంచార్జి సర్వేయర్ ఉన్నప్పటికీ, ఆయన మండలానికి తరచుగా రాకపోవడంతో పెండింగ్‌లో ఉన్న భూ కొలతలు పూర్తి కావడం లేదని చెప్పారు. భూ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఇంకా పరిష్కారం లభించలేదని ఆయన వెల్లడించారు. అందువల్ల సారంగాపూర్ మండలానికి శాశ్వత సర్వేయర్ను వెంటనే నియమించి, పెండింగ్‌లో ఉన్న భూ కొలతలను పూర్తి చేసి రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సర్పంచ్ బాస మహేష్ జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

## ఐరిష్ ఫోటో యాప్ ను రద్దు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్



**పెద్దపల్లి, మంథని, మార్చి 17 (వార్త సంధ్య) :** మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి జిరాంజి పథకాన్ని ముందుకు తీసుకు వచ్చిందని అన్నారు. ఐరిష్ ఫోటో యాప్ విధానాన్ని అమలు చేయడం ఈ పథకం అమలులో ఒక భాగం అని అన్నారు. ఈ విధానం వలన కూలీలు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. సర్వర్ డౌన్ నెట్ పనిచేయకపోవడం సిగ్నల్స్ అందకపోవడం తదితర సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఫోటోలు యాప్ లో అప్లోడ్ కావడంలేదని అన్నారు. రెండుసార్లు ఫోటోలు తీయడం ఫోటోకి ఫోటోకి మధ్యలో నాలుగు గంటల సమయం పెట్టడం వల్ల కూలీలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొలతలు ఎక్కువగా పెట్టడం వల్ల కూలీలు పనిచేయని పరిస్థితి ఉందని అన్నారు. ఉపాధి హామీ పనులు ప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. సీనియర్ మెట్లుగా పనిచేస్తున్న వారికి గత సంవత్సరం కాలంగా బిల్లులు అందటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం స్పందించి ఐరిస్ ఫోటో యాప్ విధానాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాలలో అమలవుతున్న విషమ షరతులను తొలగించి బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బోయిని పేట, దుబ్బగూడెం, గొల్ల గూడెం లలో

## ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమము.



**పెద్దపల్లి, మంథని, మార్చి 17 (వార్త సంధ్య) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని బోయిని పేట, దుబ్బగూడెం,గొల్ల గూడెం లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముండ్ల పొదలు తొలగించి మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు జంబోజు సమ్మయ్య, పోలు శివ, గుండా రాజు, నక్క నాగేంద్ర, అట్టెం రాజు, సబ్బని సమ్మయ్య, నడిపి రాజు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మా అస్తిత్వాన్ని చెరిపి వేయకండి ట్రాంజెండర్ సవరణ బిల్లు 2026 పై అడ్వకేట్ జి కిరణ్ రాజ్ ఆందోళన




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 17 :** ట్రాన్స్ జెండర్ హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ నాయకులు తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్ జెండర్స్ వెల్ఫేర్ బోర్డు మాజీ సభ్యులు జీ కిరణ్ రాజ్ కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదించిన టాన్ జెండర్స్ పర్సన్ ప్రొడక్షన్ ఆఫ్ రైట్స్ అమెండ్మెంట్ బిల్లు 20 25 తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు ఈ బిల్లును ట్రాన్స్ మెన్ వర్గాన్ని పూర్తిగా అడుగట్టుకు నెట్టే విధంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన రాత్రికి ఇలా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బిల్లును ట్రాన్స్మేన్స్ ను చట్టపైన నిర్వచనం నుండి దూరం చేస్తుందని విమర్శించారు. దీనివల్ల వేలాదిమంది ట్రాన్స్ మెన్ తమ గుర్తింపు కోల్పోయి అటు పురుషులకు పురుషులుగా ఇటు ట్రాన్స్ జెండర్లుగా కాకుండా పోయే ప్రమాదం ఉందని ఆయన ఆరోపించారు చట్టపరమైన రక్షణ లేకపోవడం వల్ల ట్రాన్సేట్ పై కుటుంబాల్లో బలవంతపు వివాహాలు అత్యంత అవమానీయమైన కరెక్షన్ రేట్స్ కరెక్షన్ థెరపీలు పెరిగే అవకాశం ఉందని కిరణ్ రాజ్ హెచ్చరించారు ఇది రాజ్యాంగ విరుద్ధమని కమ్యూనిటీ భేదాల్లో విభేదాలు సృష్టించే విధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు వెంటనే ఈ దిల్ పై పురాలోచించి బాధితుల్లో చర్చలు జరిపిన తర్వాతే ముందడుగు వేయాలని ఆయన ట్రాన్సెండలు కలిసి నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కిరణ్ నాయక్, డాక్టర్ నీతి, శృతి, కిరణ్, సావిత్రి, స్వేచ్ఛ, ఆర్ పి సమన్, తదితరులు పాల్గొని ప్రసంగించారు

## విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్షిప్లు కొత్త పద్ధతి మార్చి పాత పద్ధతి ప్రకారంగానే స్కాలర్షిప్ ఇవ్వాలని ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంకన్న కోరారు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 17 :** సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నింబోలి అడ్డ కాచిగూడ కాలేజ్ హాస్టల్ను రీఓపెన్ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రీ మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ జీవన్ పూర్తిస్థాయిలో అమలుపరచాలని కోరారు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 40% కేంద్ర ప్రభుత్వం 60% ఇంటర్మీడియట్ డిగ్రీ పీజీ ఇతర కోర్సులకు ఇస్తున్న స్కాలర్షిప్లను కొత్త పద్ధతి రద్దు పరచి పద్ధతి పద్ధతి ప్రకారమే స్కాలర్షిప్లు అమలు చేయాలని కోరారు నింబోలి అడ్డ కాచిగూడ కాంప్లెక్స్ కాలేజీ బాయ్స్ హాస్టల్ ను కూలగొట్టకుండా చిన్నచిన్న రిపేర్లు ఉన్నవి కాబట్టి వాటి రిపేర్ చేయించి రీఓపెన్ చేయవలసి ఉందిగా ఆయన కోరారు రాష్ట్రవ్యాప్తంగా కాలేజీ హాస్టల్స్ కేటరింగ్ సిస్టం వర్కర్లను రద్దుచేసి ఔట్సోర్సింగ్ లేదా కాంట్రాక్టు పద్ధతి రెగ్యులర్ చేయవలసిందిగా ఆయన కోరారు సివిల్ సర్వీస్ గ్రూప్ వన్ హాస్టల్స్ లో మేడ్చల్ రంగారెడ్డి హైదరాబాద్ హాస్టల్స్ స్పెషల్ హాస్టల్ ఏర్పాటు చేసి జాబుల కోసం హాస్టల్ టీచింగ్ చేయడానికి ఫ్యాకల్టీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కొన్ని ప్రభుత్వ కాలేజీ హాస్టల్ భవనాలు కాచిగూడ గర్ల్స్ హాస్టల్ బోలక్పూర్ దగ్గర శిథిలావస్థలో ఉన్న హాస్టల్ కూడా నిర్మాణం చేయాలని ఆయన కోరారు ఈ సమావేశంలో పలు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

## ధర్మాజిపేటలో పాఠశాలకు ఆర్ ఓ వాటర్ ప్లాంట్ అందజేత




**దుబ్బాక ప్రతినిధి మార్చి 17(వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్ ఓ వాటర్ ప్లాంట్ను అందజేశారు. మద్ముల గాల్ రెడ్డి ప్రోత్సాహంతో, ఖాజీపూర్కు చెందిన మద్దుల రాజీవ్ రెడ్డి సహకారంతో ఈ ప్లాంట్ను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఈ ఆర్ ఓ ప్లాంట్ ఎంతో ఉపయోగ పడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్మేట యేసురెడ్డి, దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, సి.ఆర్.పి. నవీన్, రాజేందర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు... మోసపోవద్దు



జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ కే.శ్రీధర్

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి 17 (వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి లో అవుట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వారధి సొసైటీ ద్వారా మాత్రమే నిర్వహించబడతాయని జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ కే. శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉద్యోగం కావాలనుకునే ఆశావహులు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వారధి సొసైటీలో నమోదు చేసుకోవచ్చునని, మధ్యవర్తులు, దళారులు చెప్పే మాటలకు మోసపోవద్దు అని,ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే నమ్మకండని,అదేవిధంగా మా జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి సర్వదా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మేము మరియు మా సిబ్బంది ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటామని తెలిపారు.

## నందిమేడారం ఆసుపత్రి నూతన భవనాన్ని పరిశీలించిన

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి 17 (వార్త సంధ్య ) :** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ మంగళవారం నందిమేడారం ఆసుపత్రి నూతన భవనాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. అలాగే ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి అందించిన వైద్య పరికరాలను కూడా పరిశీలించి, వాటి వినియోగంపై సంబంధిత అధికారు లతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ నందిమేడారం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆసుపత్రిని అత్యంత త్వరలో ప్రారంభించి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభానికి కావలసిన అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

## లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.300 కోట్ల పెట్టుబడులు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)మార్చి 17:** అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ స్థానిక కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సిఇఓ లు పెట్టుబడులకు అంగీకరించారని ఆయన చెప్పారు. "లైఫ్ సైన్సెస్, స్పెషాలిటీ కెమికల్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతోంది. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్, కెమ్ తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా అధునాతన కెమిస్ట్రీ, మెటీరియల్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ అత్యాధునిక తయారీ



కేంద్రంలో ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రాజెక్టు పూర్తి అయితే దేశం వీటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతుంది. ఔషధ పరిశోధనలు, జీవక్రియపై అధ్యయనాలు, రోగనిర్ధారణ పరీక్షలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, ఆర్గానిక్ ఎలక్ట్రో ల్యూమినిసెంట్ మెటీరియల్స్ , సెమీకండక్టర్ రంగాల్లో ఇవి విస్తృతంగా ఉపయోగపడతాయి. పరిశ్రమకు ఇక్కడ నెలకొని ఉన్న అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, అత్యున్నత మౌలిక సదుపాయాలు, మెరుగైన ప్రభుత్వ విధానాల కారణంగా జినోమ్ వ్యాలీలో పెట్టుబడి పెట్టాలని కంపెనీలు నిర్ణయించుకున్నాయి" అని శ్రీధర్ బాబు వివరించారు. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్తో భాగస్వామ్యం ద్వారా తెలంగాణలో ప్రపంచ స్థాయి తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయగలమని కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సీఈఓ డా. విశాల్ రాజ్పుత్ తెలిపారు. సమావేశంలో కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ సీఈఓ క్లిఫ్ కాల్డ్వెల్, తెలంగాణా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి బాటలు:

61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ ప్రారంభం

రైతు నేస్తం 86వ ఎపిసోడ్ వేదికగా కార్యక్రమాన్ని

ప్రారంభించిన గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 17 :** ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని రైతులకు పిలుపు ఈ నెల 20 నుండి 22 వరకు ఘనంగా 'రైతు మహోత్సవం' జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ ద్వారా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసిన రంగరెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయమే శ్రీరామరక్ష: ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితమవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు. 61,125 మంది రైతులకు కిట్ల పంపిణీ: రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం



కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహన తో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. ఈ కిట్లో ఉన్నవి: ప్రకృతి వ్యవసాయంపై "క్షేత్ర దర్శిని" పుస్తకం, క్లాత్ బ్యాగ్, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ మరియు చిన్న డైరీ. రైతు మహోత్సవానికి తరలిరండి: మార్చి 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. 150కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో



ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన. కార్యక్రమ చివరి రోజున (మార్చి 22) గౌరవ ముఖ్యమంత్రివర్యుల చేతుల మీదుగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల జమ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక ఆదాయాన్ని గడించాలని మంత్రి ఆకాంక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో లక్ష్యానికి మించి 110 శాతం నమోదు చేసి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలచి కేంద్ర ప్రభుత్వం ద్వారా 422.64 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకం పొందడంలో కీలక పాత్ర పోషించిన వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యవసాయ అధికారులు సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి , కె.సురేంద్రమోహన్ ఐఏఎస్ తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి, బి. గోపి ఐఏఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ తెలంగాణ పాల్గొన్నారు.

## భూభారతి భూసర్వే రీ సర్వే అవగాహన సదస్సు.




**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ మార్చి 17(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ధావన్ పల్లి గ్రామంలో భూభారతి 2025 - భూ సర్వే లో భాగముగా, రీ సర్వే అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.అనంతరం జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి భూ సమస్యలు కొత్తవి పునరావృతం కాకుండా మరియు పాత సమస్యలకు ముగింపు పలికెల రైతులు రిసర్వే లో భాగస్వాములు కావలని తెలియచేశారు. సర్వే అనంతరం భూదార్ కార్డులు జారీ చేస్తారు అని కూడ చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసిల్దార్ నాగార్జున ,ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కిషన్ ప్రసాద్ ,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే విఠల్రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, మండల సర్వే అధికారి నరేందర్, గ్రామ సర్పంచ్ ప్రసాద్, కార్యదర్శి, జి పి ఓ లు లావణ్య, స్వప్న, లైసెన్సు సర్వేయర్లు ప్రభాస్, వంశీ, రాంసింగ్, గ్రామ ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నరు.

## నిలోఫర్ హాస్పిటల్లో పోస్ట్గ్రాడ్యుయేట్ ఫ్యాకల్టీ కోసం పై అవగాహన (సెన్సిటైజేషన్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 17 :** ఈ కార్యక్రమం ద్వారా నివారణ, నిర్ధారణ చికిత్సకు సంబంధించిన తాజా సమాచారాన్ని అందించడం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సుమారు 150 మంది పోస్ట్గ్రాడ్యుయేట్ విద్యార్థులు 20 మంది ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారు. పాల్గొన్న వారందరూ చురుకుగా పాల్గొని చర్చలు జరపడంతో ఈ కార్యక్రమం చాలా ప్రయోజనకరంగా సమాచారపూర్వకంగా నిలిచింది.

## తిరువూరు పరిపూర్ణ బాలల ఆశ్రమానికి రైస్ బ్యాగ్ ల వితరణ.




**తిరువూరు, మార్చి 17(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం :** తిరువూరు పట్టణంలోని పరిపూర్ణ అనాధ బాలల ఆశ్రమానికి దాతల సహాయం కొన సాగుతోంది. తెలంగాణ రాష్ట్రం వేంసూరు మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన గంధం శ్రీనివాస్ (వేంసూరు మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, సత్తుపల్లి నియోజకవర్గం విద్యార్థి విభాగ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు) మరియు గంధం శివ రామకృష్ణ వర ప్రసాద్ ఆశ్రమాన్ని సందర్శించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు ఆశ్రమంలోని చిన్నారులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు రెండు రైస్ బ్యాగ్( 50కేజీ లు )ను విరాళంగా అందజేశారు. వారి సేవలను ఆశ్రమంలోని పిల్లలు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.పరిపూర్ణ ఆశ్రమ వ్యవస్థాపకులు సిరికొండ నాగేశ్వరరావు (అభి), వరలక్ష్మి దంపతులు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఎ.బి.ఎన్ రాధాకృష్ణ ను కలిసిన వల్లభనేని గిరిబాబు.



**తిరువూరు, మార్చి 17 (వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** ఆంధ్రజ్యోతి, ఎ.బి.ఎన్ మీడియా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ను తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లభనేని గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా హైదరాబాద్ లో జరిగిన భేటీలో మీడియా రంగంలో జరుగుతున్న తాజా పరిణామాలు, సమాజంలో మీడియా పాత్ర, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిజం బాధ్యతలపై ఇద్దరూ చర్చించారు.వల్లభనేని గిరిబాబు ఆంధ్రజ్యోతి, ఎ.బి.ఎన్ సంస్థలు తెలుగు జర్నలిజంలో విశ్వసనీయతను నిలబెట్టుకున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు నిజమైన సమాచారం అందించడంలో సంస్థ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

## పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న వైస్సార్సీపీ నాయకులు.



**తిరువూరు, మార్చి 17 (వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజక వర్గం :** పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా నిర్వ హించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ పాల్గొన్నారు.ఈ కార్య క్రమంలో ముస్లిం మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్ భాయ్, ఖాసీం భాయ్, కరీమ్, రఫీ, చోటు భాయ్,వాహబ్, గఫార్ తదితరులు పాల్గొని దేశం, రాష్ట్రం శాంతి-సమృద్ధులు సాధించాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాట్లాడుతూ.రంజాన్ మాసం మనకు శాంతి, సహనం, సౌభ్రాతృత్వం నేర్పే పవిత్ర కాలమని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో వైసీపీ పట్టణ అధ్యక్షులు రేగళ్ల మోహనరెడ్డి, పరసా శ్రీనివాసరావు ( బాబు ), మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్ రెడ్డి, కాలసాని నాగేశ్వరరావు, తిరుమలశెట్టి వేణు,తదితరులు పాల్గొన్నారు. సర్వమత సౌహార్దానికి వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది.

## నీర కేఫ్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

రెండేళ్లపాటు నిర్వహణకు అవకాశం

గీత కార్మిక సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

ఈ నెల 18 వరకు బిడ్ దాఖలు, 28న ఓపెనింగ్




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, మార్చి 17 (వార్త సంధ్య):** హైదరాబాద్లో గల నీర కేఫ్ను రెండేళ్లపాటు నిర్వహించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం ఉప సంచాలకులు బి. కేశురాం తెలిపారు.ఈ సందర్భంగా టెండర్కు సంబంధించిన విధి విధానాలను ఆయన వివరించారు. గీత కార్మిక సంఘాల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్ దాఖలు కోసం రూ.1000 డిమాండ్ డ్రాఫ్ట్ను "టాపర్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ (నీర కేఫ్)" పేరిట సమర్పించాలని సూచించారు.అలాగే ఎక్సైజ్ శాఖ సర్టిఫికేట్, లైసెన్స్, కుల ధృవీకరణ పత్రం, గుర్తింపు కార్డు, ఈఎండి రూపంలో రూ.2 లక్షలు, సొసైటీ తీర్మాన పత్రం వంటి అవసరమైన పత్రాలను జతచేయాలని తెలిపారు.ఆసక్తి గల వారు టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బిడ్ దాఖలు చివరి తేదీ ఈ నెల 18 కాగా, టెండర్లను ఈ నెల 28న ఓపెన్ చేయనున్నట్లు వెల్లడించారు.మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్సైట్ ఘఘ్.త్రిఎటఎ.ఎశీఎ లేదా సమీప ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉద్రిక్తం చేస్తాం: ఏఐటియుసి హెచ్చరిక

### 30న భారీ ధర్నా, ఏప్రిల్‌లో సమ్మెకు పిలుపు



**కొత్తగూడెం/సింగరేణి, మార్చి 17 (వార్త సంధ్య):** సింగరేణి సంస్థలో కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని గుర్తింపు సంఘం ఏఐటియుసి తీవ్రంగా విమర్శించింది. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించింది.మంగళవారం ఉదయం కార్పొరేట్ ప్రాంతంలోని అన్ని విభాగాల్లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం యాజమాన్యానికి మెమొరాండం సమర్పించారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించిన సమస్యలపై ఇప్పటివరకు అమలుకు సంబంధించిన సర్క్యులర్లు జారీ చేయలేదని ఏఐటియుసి నాయకులు ఆరోపించారు.ప్రధానంగా మారుపేర్లు విజిలెన్స్ కేసులు, సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఇన్‌కమ్ టాక్స్ సమస్య, డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం కల్పించడం వంటి అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు గోలేటి నుంచి కొత్తగూడెం వరకు బస్ యాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 30న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. అలాగే ఏప్రిల్‌లో జరగబోయే సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, పిట్ కార్యదర్శులు నరేష్, సుధీర్, అనంతలక్ష్మి, సూర్యప్రభ, జీవి రమేష్, శ్యాం, శ్రీనివాస్, అలాగే ఏఐటియుసి నాయకులు ప్రశాంత్, నాగయ్య, సరిత, ప్రవీణ్, వేమనాచారి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి అడ్డాగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్

### : సిట్టింగ్ జడ్జితో విచారణ డిమాండ్

### ఏసీబీ దాడులు అవినీతి తీవ్రతకు నిదర్శనం

### అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి : రామిడి శూరకర్ణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , మార్చి 17 (వార్త సంధ్య):** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతికి కేంద్రంగా మారిందని, దీనిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణ రెడ్డి డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైనప్పటి నుంచి అనేక అవినీతి ఆరోపణలు వెలువడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు కొన్ని సందర్భాల్లో అధికారులను పట్టుకొని జైలుకు పంపించినప్పటికీ, అవినీతి తగ్గలేదని విమర్శించారు. పట్టుబడిన అధికారులకు మళ్లీ ప్రమోషన్లు రావడం అవినీతి పెరగడానికి కారణమని ఆయన అన్నారు.గత ఆరు సంవత్సరాలుగా కార్పొరేషన్ పరిధిలోని పార్కులు, ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, అక్రమ ఎల్‌ఆర్‌ఎస్‌లు, డోర్ నెంబర్లు, సాధారణ బడ్జెట్ నిధుల దుర్వినియోగంపై అనేక ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా గతంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతిని నిర్మూలిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు కలిసి కార్పొరేషన్‌లో అవినీతిలో పాలుపంచుకుంటున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు.ఇటీవల జీహెచ్‌ఎంసీ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో జరిగిన ఏసీబీ దాడులు అవినీతి తీవ్రతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి అవినీతిలో పాలుపంచుకున్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామిడి శూరకర్ణ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు మంథని ఎస్సై డి.రమేష్



**పెద్దపల్లి, మంథని, మార్చి 17 (వార్త సంధ్య) :** మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గడుదులగండి ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీలలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని మంథని ఎస్ఐ డి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని ఎస్ఐ డి .రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుళ్లు శివకుమార్ మరియు ఆదేశ్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, వారి వద్ద నుండి సుమారు 120 గ్రాముల గంజాయి, 2 మోటార్ సైకిళ్లు, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తుల వివరాలు ఇలా ఉన్నాయి : చందు సంతోష్ మంథని మండలం గోపాలపూర్ గ్రామం, కోల శ్రావణ్ కాటారం మండలం చింతకాని గ్రామం, అల్లెం అరుణ్ కాటారం మండలం చింతకాని గ్రామం అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, నిందితులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని ఎస్ఐ తెలిపారు.

# కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కలిసిన వనస్థలిపురం తాజా మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మరియు టీపీసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 17:** వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డ, మాజీ ఎంపీ మరియు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ ఎల్‌బి నగర్ ఇన్‌చార్జ్ మధు యాష్కీ గౌడ్ మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ని మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వనస్థలిపురం డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.అలాగే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలపై కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం ద్వారా వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి మరింత వేగం వస్తుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మూసీ పునరుజ్జీవంపై బీఆర్ఎస్ విషప్రచారం: మధుయాష్కి గౌడ్

### గోదావరి నీటితో మూసీ శుద్ధికి ప్రభుత్వం కృషి

### ఉప్పల్‌లో కార్పొరేషన్ కార్యాలయ స్థలం పరిశీలన



**ఎల్బీనగర్ ప్రతినిధి, మార్చి 17 (వార్త సంధ్య):** మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ నాయకులు విషప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం గోదావరి నీటిని పారించి మూసీ నదిలోని కాలుష్యాన్ని తొలగించేందుకు కృషి చేస్తుండగా, ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు.మంగళవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ స్థలాన్ని మధుయాష్కి గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, భారీ నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేపడుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ నిధులను కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మళ్లించి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో దోపిడీ పెరిగిందని, కేటీఆర్ దోపిడీ నాయకులకు నాయకుడిగా వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తక్కువ కాలంలోనే ఉప్పల్ నియోజకవర్గానికి రూ.260 కోట్లకు పైగా, ఎల్బీనగర్‌కు రూ.250 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినట్లు వివరించారు.మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌లో ఇల్లు కోల్పోయే వారికి గృహ నిర్మాణం, నష్టపరిహారం అందజేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ఇందుకు రూ.10 వేల కోట్లను కేటాయించినట్లు తెలిపారు. మంచి పనులను ప్రతిపక్షం అభినందించాల్సింది పోయి ప్రజల్లో గందరగోళం సృష్టించేలా ప్రచారం చేయడం సరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ, ఉప్పల్ భగాయత్‌లో కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటు వల్ల ప్రజలకు పౌర సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీ.ఎం రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది

### - ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 17:** బాధిత భర్త విశ్వనాథ్ కి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ ఆందజేస్తున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూరి కాలనీ నందు నివాసం ఉండే విజయకుమారి గుండెనొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని సంప్రదించారు. స్పందించిన సుధీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,ఆందోజు సత్యంచారి,పగిడిమర్రి శంకర్,నారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ కాలనిలో అభివృద్ధి పనులు పరిశీలించిన హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 17:** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తన హయంలో మంజూరైన నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు కాలనీవాసులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, వర్షాకాలానికి ముందుగానే రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు యాదగిరి యాదవ్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ప్రశిక్షణ తరగతుల సమీక్ష సమావేశం - తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి




**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 17:** బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఈ నెల మార్చ్ 21 నుంచి మార్చ్ 22 వరకు కె.ఐ.ఎం.టి ఇంజనీరింగ్ కళాశాల , మంగళ్ పల్లిలో నిర్వహించబడుతున్న పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతుల గురించి నిర్వహించిన సమీక్ష సమావేశ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి, బిజెపి పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ తరగతుల కార్యక్రమం మరియు పార్టీ సిద్ధాంతాలు, కార్యచరణ మరియు భవిష్యత్ కార్యక్రమాలపై మార్గదర్శనం ఇవ్వడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత, శంకరయ్య గౌడ్, భూపాల్ రెడ్డి, శ్రీధర్ రావు, ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్ రెడ్డి,రవిశంకర్, మహేష్ గౌడ్,శ్రీనివాస్ శర్మ,వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగేష్, మహిళా నాయకురాలు దేవిక, నాయకులు కాంతారావు, ప్రభాకర్ యాదవ్,నరసింహారెడ్డి, శంకరన్న, మహిపాల్ రెడ్డి, గోపి, శ్రీనివాసరావు, కిషోర్, విజయ్, సురేష్ కుమార్, దుర్గాప్రసాద్, శశి హరి,సాయిరాం మరియు తదితరులు పాల్గొన్నారు.

# మంథని పట్టణంలో ఇంట్లో చొరబడి దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్




**పెద్దపల్లి, మంథని, మార్చి 17 (వార్త సంధ్య ) :** మంథని పట్టణంలోని ఒక ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని మంథని ఎస్ఐ డి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు నిందితుడి వద్ద నుండి సుమారు 9.30 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తి వివరాలు ఇలా ఉన్నాయి: మంథని కి చెందిన తిరునాహరి రాజు గా గుర్తించామని తెలిపారు. ఈ ఆపరేషన్ లోపోలీస్ కానిస్టేబుళ్లు అనిల్, శివ కుమార్, నితిన్, రామకృష్ణ,వంశీ పాల్గొన్నారు.

# గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న ఐదు హోటల్లు సీజ్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మార్చి 17 (వార్త సంధ్య) : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రాంతంలో సివిల్ సప్లయి అధికారులు మంగళవారం వివిధ హోటళ్లలో ఆకస్మిక తనిఖీ లు చేయగా గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 8 సిలిండర్లను సీజ్ చేసి 5 హోటళ్ల పై కేసులు నమోదు చేశారు.

# గంపలగూడెం మండలంలో సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కుల పంపిణీ.




**గంపలగూడెం,మార్చి17(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం.** పేదల కష్టాల్లో తోడుగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ ఆధ్వర్యంలో గంపలగూడెం మండల నాయకులతో కలిసి.మండలంలో గల పెద్ద కొమెర, మేడూరు, ఆర్లపాడు, నెమలి, కనుమూరు గ్రామాల్లో సుమారు 3,06,149/- రూపాయలు పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ సహకారంతో మంజూరైన టువంటి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చెసారు.ఈ చెక్కు లను లబ్ది దారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా అంధజేసారు.ఈ కార్యక్రమంలో చెరుకూరి రాజేశ్వరరావు, రేగళ్ల వీరారెడ్డి, మానుకొండ రామకృష్ణ, దిరిశాల వెంకట కృష్ణారావు, జంగా చెంచి రెడ్డి, రేగళ్ల సిద్ద రెడ్డి, తుమ్మూరి అప్పిరెడ్డి, చెరుకు సత్యనారాయణ రెడ్డి,అత్తునూరి సత్యనారాయణ రెడ్డి, అట్లూరి వెంకటరెడ్డి , గాజుల వెంకటేశ్వర్లు , అత్తునూరి వెంకట రెడ్డి,మావూరి రామ కోటరెడ్డి, కొమ్ము పెద్ద వెంకటేశ్వర్లు , కావూరి బాబు , ఇనుగంటి మధుసూదన్ రావు, పంగులూరి రాంబాబు , బూరుగు నారాయణ , కోట వెంకటేశ్వరరావు, గువ్వల వెంకటేశ్వర రెడ్డి , వజ్రాల వీరారెడ్డి , రేగళ్ల రవీంద్రారెడ్డి , యరమాస చంద్రం , ఉనుకూరి భరత్ కుమార్ రెడ్డి , కోట రామ లక్ష్మణ్ మున్న, కొమ్ము కుటుంబరావు, షైక్ సైదులు , రాంమూర్తి , పగడాల నవీన్ , చెరుకు నరసారెడ్డి , మరిదు రామకృష్ణ ,పరిసా రాజా, మరియు గంపలగూడెం మండల నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 3 విడుతలలో రైతు భరోసా నిధులు జమ..

### జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్

### మార్చి 25 వరకు కొత్త పట్టాదారులు బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి17( వార్త సంధ్య) :** యాసంగి 2026 సీజన్ సంబంధించి రైతు భరోసా నిధులను మూడు విడుతలలో విడుదల చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 22న సిద్దిపేట జిల్లాలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ నూనె ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాసంగి సీజన్ 2026 రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని, మన జిల్లాకు సంబంధించి 1,51,300 మంది రైతుల ఖాతాలలో 162 కోట్ల 52 లక్షల రూపాయలు మూడు దఫాలుగా విడుదల ఏప్రిల్ నెలాఖరు నాటికి రైతు భరోసా నిధులు జమ అవుతాయని అన్నారు. ఫిబ్రవరి 28 నాటికి జారి అయిన పట్టాదారు పాస్ పుస్తకాల కు సంబంధించిన రైతులకు రైతు భరోసా చెల్లించడం జరుగుతుందని, నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా నిధుల కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని, ఇతర వివరాల కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పేర్కొన్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షలో మెరిసిన పెంబట్ల విద్యార్థి

### : జిల్లా స్థాయిలో 25వ ర్యాంకు కైవసం




**సారంగాపూర్ (వార్త సంధ్య)మార్చి 17:** జవహర్ నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన ముద్దం పార్థు అద్భుత ప్రతిభ కనబరిచాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో పార్థు జిల్లా స్థాయిలో 25వ ర్యాంకు సాధించి, నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించాడు.గ్రామీణ ప్రాంతానికి చెందిన పార్థు, చిన్నప్పటి నుండి చదువులో చురుగ్గా ఉంటూ ఈ ఘనత సాధించాడు. ప్రవేశ పరీక్షలో 92.50 మార్కులు సాధించి తన సత్తా చాటాడు. ఇందులో మెంటల్ ఎబిలిటీలో 47.50, అర్థమెటిక్‌లో 22.50 , లాంగ్వేజ్‌లో 22.50 మార్కులు సాధించాడు. తల్లిదండ్రుల హర్షం పార్థు తండ్రి ముద్దం చిరంజీవి, తల్లి ముద్దం హారిక తమ కుమారుడి విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉంటూ, సరైన వసతులు లేకపోయినా పట్టుదలతో చదివి జిల్లా స్థాయిలో టాప్ ర్యాంకర్లలో ఒకడిగా నిలవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. పెంబట్ల గ్రామస్తులు ఉపాధ్యాయులు పార్థును అభినందనలతో ముంచెత్తారు.

# మాదకద్రవ్యాలను వాడటం వారికి ఇదే మొదటిసారి కాదా

**మొయినాబాద్ డ్రగ్స్ కేసులో తలెత్తుతున్న కొత్త అనుమానాలు**

**మాదకద్రవ్యాలను వాడకం ఇదే మొదటిసారి కాదా**

**పుట్టా మహేశ్, నమిత్‌శర్మల నమూనాల్లో ఇతర డ్రగ్స్ అవశేషాలు**



తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో సరికొత్త అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసుల దాడిలో దొరికిన ఎంపీ పుట్టా మహేశ్, నమిత్‌శర్మల పరీక్ష నమూనాలో ఇతర డ్రగ్స్ అవశేషాలు సైతం ఉండటం దీనికి మరింత బలం చేకూర్చింది. దీని ప్రకారం వారికి గతంలో కూడా మాదకద్రవ్యాలను వినియోగించే అలవాటు ఉండొచ్చని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో సహా అతని స్నేహితుడైన నమిత్‌శర్మల మత్తు చరిత్ర పలు అనుమానాలకు తావిస్తోంది. డ్రగ్స్ ఉపయోగించే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఢిల్లీకి చెందిన నమిత్‌శర్మ అదే విధంగా ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు సైతం లభించడమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. నిజానికి కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మాదకద్రవ్యాల సరఫరాను గుర్తించేందుకు అవకాశాలు ఉన్న ఉద్దేశంతోనే పోలీసులు ఈ గత విషయాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్నారు.డ్రగ్స్ వాడకం ఇదే మొదటి సారా? మొయినాబాద్ ఫాంహౌస్ పార్టీలో మాదకద్రవ్యాలను వినియోగించలేదని నిందితులు ముందు అడ్డంగా బుకాయించినా సరే పోలీసులు నిర్వహించిన పరీక్షల్లో మాత్రం మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాలో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ అవశేషాలు లభ్యమయ్యాయి. ఇక ఎంపీ పుట్టా మహేశ్ నమూనాలో ప్రధానంగా యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ అవశేషాలు లభించాయి. అంతేకాకుండా మిగిలిన నలుగురు సైతం కొకైన్‌ను వినియోగించినట్లు నిర్ధరణ అయింది. అదే విధంగా పోలీసుల విచారణలో నేను శిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చానని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించడం గమనార్హం.ముఖ్యంగా పోలీసుల అధికారులు నిర్వహించిన సోదాల్లోనూ కొకైన్ మినహాయించగా ఇతర డ్రగ్స్ అవశేషాలేవీ అక్కడ దొరకలేదు. అయితే, నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌ల నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు లభ్యమయ్యాయి. దీని ప్రకారం వీరు ఇరువురూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా లేక అంతకుముందేమైనా వినియోగించారా అనేది మాత్రం తదుపరి నిర్వహించబోయే దర్యాప్తులో తెలుస్తుందని అధికారులు అన్నారు. దాంతో వీటన్నింటినీ నిశితంగా పరిశీలించినట్లయితే మొయినాబాద్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో దొరికిన వారందరికి కూడా గత కొంతకాలంగా మాదకద్రవ్యాలను వినియోగించే అలవాటు అనేది ఉన్నట్లుగా పోలీసు యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేస్తుండటం గమనార్హం.

**కౌశిక్ రవి వెల్లడి :** వ్యాపార పనుల నిమిత్తం తాను శిమ్లాకు వెళ్లినపుడు మొత్తం రూ. 15,000 పెట్టి కొకైన్ కొనుగోలు చేసినట్లు కౌశిక్ రవి పోలీసులకు వెల్లడించాడు. ఘటనా స్థలంలో 0.26 గ్రాములను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆపై దీనిపై పరీక్షలను నిర్వహించినప్పుడు ఇందులో ముఖ్యంగా ఆరుగురు మత్తుపదార్థాలను ఉపయోగించగా అందులో మొత్తం ఐదుగురు కొకైన్‌ను వాడినట్లు నిర్ధారణ అయింది. ఇక సాధారణంగా దేశీయ మార్కెట్లో గ్రాము కొకైన్ విలువ రూ. 10,000 వరకు ఉంటుంది. వీటన్నింటినీ పరిశీలిస్తే కౌశిక్ రవి చెప్పిన లెక్కల ప్రకారం గ్రామున్నర కొకైన్ తీసుకొచ్చి ఉండాలి. కానీ ఐదుగురు అప్పటికే ఉపయోగించడం గమనించాల్సిన విషయం. అయితే ఇందులో ఉపయోగించని కొకైన్ కొంత దొరికింది.తప్పించుకునే ఉద్దేశంతోనే! కొకైన్‌ను ఐదుగురు వినియోగించిన అనంతరం సైతం ఇంకొంచెం మిగిలి ఉన్నట్లయితే కౌశిక్ రవి చెప్పిన దానికంటే ఇంకాస్త ఎక్కువే తెచ్చి ఉంటారని పోలీసులు పలు రకాలైన అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ కొకైన్ 20 గ్రాముల కంటే ఎక్కువ మొత్తంలో లభ్యమైనా లేదా వినియోగించినట్లు రుజువైనా నిందితులను మాత్రం చట్టప్రకారం అరెస్టు చేసే అధికారం ఉంది. ఒకవేళ దీనిని తప్పించుకునే ఉద్దేశంతో తక్కువ మోతాదు తెచ్చామని చెప్పారేమోనని అధికారులు అనుమానిస్తున్నారు.

# విజయవాడలోనూ డీజీ రైతు బజార్లు

**యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు**

**ఏపీలో కొత్తరూపు సంతరించుకుంటున్న రైతు బజార్లు**

**డీజీ యాప్ ద్వారా ఇళ్లకే కూరగాయలు, నిత్యావసరాలు అందజేత**

**తాజాగా విజయవాడలోనూ డీజీ రైతు బజార్ కార్యకలాపాలు ప్రారంభం**




వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రాష్ట్రంలో రైతు బజార్లు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. యాప్ ద్వారా వినియోగదారుల ఇళ్లకే కూరగాయలు, నిత్యావసరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే విశాఖ, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో ఆన్‌లైన్ రైతుబజార్లకు శ్రీకారం చుట్టగా, తాజాగా విజయవాడలోనూ యాప్ ద్వారా కార్యకలాపాలు ప్రారంభించారు. అందరికీ డీజీ రైతుబజార్ యాప్ వినియోగంపై అధికారులు ప్రచారం కల్పిస్తున్నారు.

**ఏపీలో డీజీ రైతుబజార్లు:**

ప్రభుత్వం రైతుబజార్లను అందుబాటులోకి తెచ్చాక కూరగాయలు సరసమైన ధరలకే లభ్యమవుతున్నాయి. రైతులు కూడా తమ సరుకులను ఇక్కడే విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారు. కాలానుగుణంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇంటి వద్దకే కూరగాయలు అందించే సేవలను తాజాగా అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్ విక్రయాలు పెరుగుతుండటంతో డీజీ రైతుబజార్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ మార్కెటింగ్ శాఖతోపాటు మాచింట్ సంస్థ సంయుక్తంగా ఈ సేవలను అందిస్తున్నాయి.

**నేరుగా ఇంటి వద్దకే డోర్ డెలివరీ:** గూగుల్ ప్లే స్టోర్ నుంచి డీజీఆర్‌బీ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబర్, చిరునామా వంటివి నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత దగ్గర్లోని రైతుబజార్‌కు ఆర్డర్ చేస్తే నేరుగా కూరగాయలు ఇంటికే రానున్నాయి. కూరగాయలు, ఆకుకూరలు, కొన్ని నిత్యావసర వస్తువులు సైతం ఇంటి వద్దకే అందుతాయి. కనీసం వంద రూపాయలలోపు ఆర్డర్ చేస్తే హ్యాండ్లింగ్ ఛార్జీలు, జీఎస్టీ కలిపి రూ. 49 వరకు ఛార్జీలు వసూలు చేస్తారు.ఆన్‌లైన్ రైతుబజార్లు అందుబాటులోకి రావడం వల్ల మార్కెటింగ్ విస్తరణతోపాటు వినియోగదారులకు సులభతరంగా సేవలు అందించడానికి వీలవుతుందని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ రైతుబజార్ల నిర్వహణలో తలెత్తే చిన్నచిన్న సమస్యలపై అధ్యయనం తర్వాత పూర్తిస్థాయిలో అన్ని ప్రాంతాల్లో డీజీ రైతుబజార్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.“ఆన్‌లైన్ డీజీఆర్‌బీ సేవల ద్వారా రైతు బజార్లకు రాలేని పెద్దవారు, ఉద్యోగులు, గృహిణులందరికీ ఇది సౌకర్యంగా ఉంటుంది. అది కూడా పెద్దగా ఛార్జీలేం కాదు. రైతు బజారులో ఎంతైనా ధర ఉంటుందో అంతే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా అందించడం జరుగుతుంది. సర్వీస్ ఛార్జెస్ ఒకటే వారి వద్ద నుంచి తీసుకోవడం జరుగుతుంది. ఈ సేవలను వినియోగించుకునే వారికి అనుకూలంగా ఉంటుంది. ఈ డీజీఆర్‌బీ రైతు సేవల ద్వారా రైతులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని రైతులు, వినియోగదారులు సద్వినియోగపరచుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను“-ఎం.రమేశ్‌బాబు ,ఎస్టేట్ ఆఫీసర్, పటమట రైతుబజార్“ఆన్‌లైన్ రైతుబజార్లు అందుబాటులోకి రావడం వల్ల మార్కెటింగ్ విస్తరణతోపాటు వినియోగదారులకు సులభతరంగా సేవలు అందించడానికి వీలవుతుంది. ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. అంతే కాకుండా సమయం వృథా కాకుండా ఈ సేవలు ఎంతగానో దోహదపడతాయి. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో రైతుబజార్లకు రాలేని వారికి ఈ సేవలు ఉపయుక్తంగా ఉంటాయి. రైతు బజారులో నిర్ణయించిన ధరలకే మీ ఇంటికి డోర్ డెలివరీ ద్వారా సేవలు అందుతాయి. కాకపోతే డెలివరీ చేసినందుకు కొద్ది మొత్తంలో మాత్రమే సర్వీస్ ఛార్జీలను వసూలు చేస్తారు. సామాన్య ప్రజలు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు ఇలా అందరూ ఈ డీజీఆర్‌బీ సేవలను పొందాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాం“-శ్రీనివాస్, కోఆర్డినేటర్, డీజీ రైతుబజార్

# గ్రూప్-1 ఉద్యోగుల బదిలీపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

**విచారణ నేటికి వాయిదా**

**తమ ఆదేశాలు అమలు చేశారా లేదా చెప్పాలని**

**ప్రభుత్వానికి ఆదేశం**

**నివేదిక సమర్పణకు మరికొంత సమయం కావాలని**

**సిట్ అఫిడవిట్ వేయడంపై తీవ్ర అభ్యంతరం**

**సిట్ తీరుపై అసహనం**



గ్రూప్ -1 పరీక్ష ద్వారా ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న వారిని ఫోకల్ నుంచి నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలంటూ తామిచ్చిన ఆదేశాలను సరైన స్ఫూర్తితో అమలు చేశారా లేదా చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. డీఎస్పీలను డీజీపీ, ఆర్డీవోలను సీసీఎల్ఏ కార్యాలయాల్లో రిపోర్ట్ చేయాలని మాత్రమే రాతపూర్వక ఆదేశాలిచ్చారని, డీజీపీ ఆదేశాలతో డీఎస్పీలు ఇప్పటికీ గత స్థానాల్లోనే (రిజిస్టర్లలో సంతకం చేయకుండా) కొనసాగుతున్నారన్న వార్తలో వాస్తవమేంటో కనుక్కొని చెప్పాలని అడ్వొకేట్ జనరల్‌కు సూచించింది.డీఎస్పీలు గత స్థానాల్లోనే ఉంటూ ప్రభుత్వ బంగ్లా, వాహనం, అదే సెల్ సిమ్‌ను వినియోగిస్తున్నట్లు ఓ పత్రికలో కథనం వచ్చిందని అది నిజమే అయితే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు అగౌరవపరిచినట్లే అని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు సీఎస్, సిట్ వ్యవహరించనప్పుడు దర్యాప్తు సక్రమంగా జరుగుతుందని ఎలా విశ్వసించగలమని వ్యాఖ్యానించింది.గ్రూప్ -1 మూల్యాంకనంలో అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తే రాష్ట్ర పోలీసు వ్యవస్థపై కోర్టుకు విశ్వాసం లేదనే భావన ప్రజల్లోకి వెళ్లే ప్రమాదముందని తెలిపింది. కానీ, రాష్ట్ర పోలీసు వ్యవస్థ సమర్థతపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొంది. అందుకే సిట్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించామంది. తమ ఆదేశాలను సిట్ అమలు చేయకపోతే దర్యాప్తును సీబీఐకి అప్పగించే విషయాన్ని పరిశీలిస్తామని వ్యాఖ్యానించింది.

**విచారణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు :** మరోవైపు నివేదిక సమర్పణకు మరికొంత సమయం కావాలని సిట్ కోర్టులో అఫిడవిట్ వేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. రిపోర్టు వేయలేని స్థితిలో ఉంటే కనీసం ముందు రోజైనా సమయం పొడిగించాలని అఫిడవిట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించింది. నివేదిక సమర్పించాల్సిన రోజు అఫిడవిట్ దాఖలు చేసి సమయం కోరడం సిట్ బాధ్యతారాహిత్యమేనంది. సమయం పొడిగించాలని కోరుతూ సిట్ వేసిన అఫిడవిట్ ను తమ ముందు విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం సోమవారం (నిన్న) ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని, ఈ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులను నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. సిట్ నివేదిక సమర్పించేందుకు విచారణను వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీలు గత స్థానాల్లోనే కొనసాగుతున్నారంటూ ఓ పత్రికలో వచ్చిన వార్త చర్చకు వచ్చింది. దీని పై ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, ఆ వార్తా కథనంలో వాస్తవం ఉందని తాను అనుకోవడం లేదని అన్నారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు విచారణను మంగళవారానికి వాయిదా వేయాలని కోరగా, న్యాయస్థానం సమ్మతించింది.

# మిత్ర బంధం - ‘మత్తు‘ బంధం

**నేపథ్యాలు వేరు, వ్యాపారాలు మాత్రం సేమ్**

**గతంలోనూ ఇలాంటి పార్టీలు!**

**నిందితులందరిదీ వేర్వేరు నేపథ్యాలు**

**అందరికీ స్థిరాస్తి వ్యాపారాలు ఉన్నాయని ప్రాథమిక సమాచారం**

**వ్యాపారాల సెటిల్‌మెంట్లకు తరచూ కలుసుకునే వారని చెబుతున్న పోలీసులు**

**హైదరాబాద్‌తో పాటు ప్రముఖ నగరాల్లో ఇదే తరహా పార్టీలు**



రాజస్థాన్ స్థిరాస్తి వ్యాపారి, బెంగళూరు న్యాయవాది, ఏలూరు ఎంపీ, తాండూరు మాజీ ఎమ్మెల్యే. ప్రాంతాలతో సంబంధం లేని వీరి మధ్య బలమైన మత్తు బంధం ఏర్పడింది. వీరితో పాటు రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో పోలీసులకు చిక్కిన మరో ఏడుగురు వ్యక్తులకు వేర్వేరు నేపథ్యాలు ఉండటం గమనార్హం. వీరందరికీ రకరకాల వ్యాపారాలు ఉన్నాయి. అయితే ఇంచుమించు అందరికీ స్థిరాస్తి వ్యాపారాలు ఉన్నాయని తెలుస్తోంది. వీరంతా వ్యాపారాల సెటిల్‌మెంట్ల గురించి తరచూ కలుసుకునే వారని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. గతంలోనూ హైదరాబాద్ వచ్చినప్పుడు రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లోనే పార్టీలు చేసుకునే వారని తెలిసింది. హైదరాబాద్‌లోనే కాకుండా దేశంలోని ప్రముఖ నగరాలైన దిల్లీ, బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ తరచూ ఇలాంటి పార్టీలు జరిగేవని సమాచారం.

**నిరంతరం దాడులు చేస్తున్నా :** మరోవైపు ఇటీవల తెలంగాణ పోలీసులు డ్రగ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ‘ఈగల్‘ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి నిరంతరం దాడులు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా మహానగరం శివార్లలోని ఫాంహౌస్‌లలో జరిగే రేవ్ పార్టీల గుట్టు రట్టు చేస్తున్నారు. అయినప్పటికీ ఏమాత్రం సంకోచించకుండా, తాను లోక్‌సభ సభ్యుడిని అనే స్పృహ కూడా లేకుండా మత్తు పార్టీకి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ రావడంపై పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడం, దుబాయ్‌లో తన వ్యాపారాలు ఆశాజనకంగా లేకపోవడం, ఇక్కడా సొంత స్థిరాస్తి వ్యాపారంలో పెద్దగా పురోగతి లేకపోవడంతో వీటికి సంబంధించిన కార్యకలాపాలన్నీ కొంతకాలంగా రోహిత్‌రెడ్డి తన ఫాంహౌస్‌లోనే నిర్వహిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే తరచూ పార్టీలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**అందుకే దొరికిపోయారు :** ఇదంతా మామూలు వ్యవహారంగా మారిందనే మొండి ధైర్యంతోనే పుట్టా మహేశ్‌తో పాటు మిగతా వారికి సైతం ఎలాంటి అనుమానం రాలేదని పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. అందుకే తమకు దొరికిపోయారని తెలిపారు. ఇదిలా ఉంటే ఫాంహౌస్ పార్టీ కోసం రోహిత్‌రెడ్డి కొన్ని రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు దాఖలు చేసిన రిమాండు రిపోర్టులో పేర్కొన్నారు. కౌశిక్‌రవి సిమ్లా నుంచి సరకు తీసుకొని రాగానే శనివారం పార్టీ ఖాయమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ సమావేశాల్లో పాల్గొనేందుకు దిల్లీ వెళ్లిన పుట్టా మహేశ్‌కు తన స్నేహితుడు రోహిత్ రెడ్డి నుంచి పిలుపు రాగానే మరో స్నేహితుడు, దిల్లీలో ఉంటున్న రాజస్థాన్ వాసి నమిత్ శర్మతో కలిసి హైదరాబాద్‌లోని ఫాంహౌస్‌కు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. దీన్ని నిర్ధారించుకునేందుకు వారి ప్రయాణ వివరాలను ఆరా తీస్తున్నారు.

**ఏం జరిగిందంటే? :** రోహిత్ రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఫాంహౌస్‌లో స్నేహితులకు పార్టీ ఇవ్వాలనుకున్నారు. దీనికోసం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, రోహిత్ రెడ్డి సోదరుడు రితేశ్ రెడ్డి, అమీర్‌పేటకు చెందిన విజయకృష్ణ, పుప్పాలగూడకు చెందిన అర్జున్ రెడ్డి, మణికొండకు చెందిన వ్యాపారులు రమేశ్, వరమాచినేని శ్రవణ్ కుమార్, దిల్లీకి చెందిన వ్యాపారి నమిత్ శర్మ, బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్ రవి, వికారాబాద్ జిల్లా కన్యాలాల్‌బాగ్‌కు చెందిన శరత్‌కుమార్, ఫిల్మ్‌నగర్‌కు చెందిన ప్రియాంకా రెడ్డి ఫాంహౌస్‌కు వచ్చారు. ఈ పార్టీకి విదేశీ మద్యం తీసుకువచ్చారు.

**తుపాకీతో కాల్చిన దిల్లీవాసి నమిత్‌శర్మ :** ఇక్కడ డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్, చేవెళ్ల, శంషాబాద్ ఎస్‌వోటీ మొయినాబాద్ పోలీసులు సుమారు 40 మంది సోదాలకు వెళ్లారు. నేరుగా సోదాలకు వెళితే నిందితులు తలో దిక్కుకు పారిపోతారని ఫాంహౌస్ చుట్టూ ఉన్న గోడ దూకి లోపలికి ప్రవేశించారు. పార్టీ జరిగే క్రమంలో మూడుసార్లు పేలుళ్ల శబ్దం వినిపించింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలో నమిత్‌శర్మ పోలీసులవైపు తుపాకీతో ఒక రౌండ్ కాల్చాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోనికి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో డ్రగ్స్ వినియోగించారనే అనుమానంతో పార్టీకి వచ్చిన 11 మందికి పరీక్షలు జరపగా, వారిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది.

# ‘పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి‘

**రోహిత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధిష్ఠానం చర్యలు**

**పైలట్ రోహిత్‌రెడ్డి వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన బీఆర్ఎస్ అధిష్ఠానం**

**షోకాజ్ నోటీసు జారీ చేసిన భారత రాష్ట్ర సమితి**

**వారం రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశాలు**



మాదక ద్రవ్యాల వినియోగం ఆరోపణల నేపథ్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై భారత రాష్ట్ర సమితి చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమా భరత్ కుమార్ ఈ మేరకు నోటీసు ఇచ్చారు. ఈ అంశం విస్తృతంగా మీడియాలో ప్రచారం పొందడం వల్ల పార్టీ ప్రతిష్ఠకు, ప్రజల్లో ఆందోళనకు దారితీసిందని నోటీసులో పేర్కొన్నారు.

**నైతిక విలువలకు కట్టుబడి ఉన్నాం :** భారత రాష్ట్ర సమితి పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలను పాటించడంలో కట్టుబడి ఉందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగం లేదా వాటితో ఏ విధమైన సంబంధం కలిగి ఉండటాన్ని పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రోహిత్ రెడ్డి ప్రమేయంపై వచ్చిన ఆరోపణలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉండటంతో ఈ విషయాన్ని పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజుల్లోపు స్పష్టమైన, సమగ్ర లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని రోహిత్ రెడ్డిని ఆదేశించారు.

**నోటీసు లేకుండానే తగిన క్రమశిక్షణా చర్యలు :** ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలు, అధికారిక కార్యకలాపాల్లో రోహిత్‌రెడ్డి పాల్గొనకుండా ఉండాలని కూడా ఆదేశాలు ఇచ్చామని భరత్ కుమార్ పేర్కొన్నారు. నోటీసుకు గడువులోగా సంతృప్తికరమైన వివరణ సమర్పించకపోతే పార్టీ రాజ్యాంగం, నియమావళి ప్రకారం ఎటువంటి అదనపు నోటీసు లేకుండానే తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

**ప్రత్యేక విచారణ బృందం సిట్ ఏర్పాటు :** ఇదిలా ఉండగా, మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు మూలాలను, అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక విచారణ బృందం సిట్‌ను ఏర్పాటు చేయనుంది. సిట్ ఏర్పాటు చేస్తూ ఇవాళ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది.

**ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన అంశాలపై విచారణ :** రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఈ సిట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన పార్టీలో డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ కావడం, విచారణకు వెళ్లిన పోలీసులపై కాల్పులు జరపడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో గతంలోనూ ఇలాంటి అసాంఘీక ఘటనలే జరిగాయన్న సమాచారం ప్రభుత్వానికి చేరడంతో ఈ ఫాంహౌస్ వేదికగా జరుగుతున్న, జరిగిన అంశాలపైనా సిట్ విచారణ చేయనుంది.

**పలు అంశాలపై ఆరా :** రోహిత్ రెడ్డి పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా చేశారు? డ్రగ్స్‌తో పాటు అసలు ఫాంహౌస్‌లో ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి? గతంలో ఎవరైనా ప్రముఖులు ఇక్కడికి వచ్చారా? వస్తే వారికి ఎలాంటి పార్టీ ఇచ్చారు? ఇదే తరహాలో ఎన్ని పార్టీలు జరిగాయి? అన్న కోణంలో సిట్ విచారణ చేసే అవకాశం ఉంది. డ్రగ్స్ దందాతో పాటు దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై సిట్ ఆరా తీయనుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో నిందితులకు ఏమైనా పరిచయాలు ఉన్నాయా? అన్న లింకులపైనా సిట్ బృందం ఫోకస్ చేయనుంది. సిట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో ఈ కేసులో మరికొంతమంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందా? అన్న ఉత్కంఠ నెలకొంది.

# కూకట్‌పల్లిలో భారీ దారి దోపిడీ

**కళ్లలో కారం కొట్టి రూ.కోటి లూటీ**

**అర్ధరాత్రి డబ్బులు తరలిస్తున్న వ్యక్తుల కళ్లలో కారం కొట్టి దోపిడీ**

**రూ.కోటి నగదుతో పరారైన గుర్తుతెలియని వ్యక్తులు**

**నిందితుల కోసం 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు**



హైదరాబాద్ కూకట్‌పల్లిలో పెద్ద మొత్తంలో నగదు దోపిడీ జరిగింది. ద్విచక్ర వాహనంపై బాక్సులో రూ.కోటి నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి గుర్తు తెలియని మరో నలుగురు ఆగంతకులు దోచుకుపోయారు. పోలీసుల వివరాల ప్రకారం, బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై డబ్బు తీసుకెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. కూకట్‌పల్లి మెట్రో పిల్లర్ నెంబర్ 837 వద్దకు చేరుకోగానే 2 బైకులపై నలుగురు దుండగులు వచ్చి కళ్లలో కారం కొట్టి, నగదుతో పరారయ్యారు. ఆ డబ్బును బహదూర్‌పురా నుంచి జీడిమెట్లకు తరలిస్తున్నట్లు సమాచారం.విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆ రూ.కోటి హవాలా సొమ్ముపై పోలీసులు అనుమానాలే నిజం అయ్యాయి. తాజాగా పరారీలో ఉన్న నిందితులను శంషాబాద్ వద్ద పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు తెలిపారు. ఎవరి ఆదేశాలతో డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేస్తున్నారు అనే కోణంలో ఇద్దరు బాధితులను ఆరా తీయగా, కూకట్‌పల్లి పీఎస్ ఎదురు అపార్ట్‌మెంట్‌లో హవాలా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ వద్ద నగదు అపహరణ చేశారు. కూకట్‌పల్లి నుంచి జీడిమెట్లకు రూ.కోటి హవాలా డబ్బు తరలిస్తుండగా బైకులపై నలుగురు దుండగులు వచ్చి దారి దోపిడీ చేసినట్లు గుర్తించారు. నాలుగు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలించి పట్టుకున్నారు.ద్వారకా తిరుమలలో నకిలీ టికెట్ల వ్యవహారం

# 'కొత్త సుంకాల విధానం ఖరారైన తర్వాతే అమెరికా

### భారత్ వాణిజ్య ఒప్పందం'

### ప్రస్తుతం భారత్- అమెరికా మధ్య ఒప్పందంపై చర్చలు

### జరుపుతున్నామని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడి



అమెరికా- భారత్ మధ్య కొత్త సుంకాల విధానం ఖరారైన తర్వాతే ఇరు దేశాల ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరుగుతాయని ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. ప్రస్తుతం భారత్- అమెరికా మధ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నామని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వివరించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఇతర దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గ్లోబల్ టారిఫ్ ఆర్కిటెక్చర్‌పై అమెరికా పని చేస్తోందని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ట్రేడ్ డీల్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.'అనిశ్చితుల నేపథ్యంలో భారత ఎగుమతి పనితీరు స్థిరంగా ఉంది''"మేము ప్రస్తుతం అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చిస్తున్నాం. కొత్త సుంకాల విధానం అమల్లోకి వచ్చిన తర్వాతే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరుగుతాయి" అని ఆయన చెప్పారు. తాజా వాణిజ్య డేటాను ప్రభుత్వం ప్రచురించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. నెలవారీ తగ్గుదల ఉన్నప్పటికీ, ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో భారత ఎగుమతి పనితీరు స్థిరంగా ఉందని వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ అన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం నేపథ్యంలో సరకు అంతరాయాల కారణంతో మార్చిలో షిప్‌మెంట్‌లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో దిగుమతులు 24.11 శాతం పెరిగి 63.71 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంలో 51.33 బిలియన్ డాలర్ల దిగమతులు నమోదయ్యాయి. ఫలితంగా ఫిబ్రవరిలో వాణిజ్య లోటు 27.1 బిలియన్ డాలర్లకు పెరిగింది.2025 ఫిబ్రవరి 13న నుంచి భారత్, అమెరికా మధ్య పలు దశల్లో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు జరిగాయి. భారత్, అమెరికా పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇరు దేశాలు గత నెలలో తొలిదశ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్‌నకు ఇరు దేశాలు ఆమోదం తెలిపాయి. దాని ప్రకారం భారత్‌పై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గించేందుకు అమెరికా అంగీకరించింది. ఇందులో భాగంగా ఈ నెలలో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉంది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను ఆ దేశ సుప్రీం కోర్టు కొట్టివేసింది. దీంతో ఆర్టికల్ 122 ప్రకారం అన్ని దేశాలపై అమెరికా 10 శాతం టారీఫ్‌లను విధించింది. గత నెల 24 నుంచి 150 రోజుల పాటు ఇవి అమల్లో ఉంటాయి. దీంతో టారిఫ్ అంశంపై సందిగ్ధత నెలకొంది.ఏప్రిల్‌లో సంతకాలు జరిగే అవకాశంమరోవైపు భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం వల్లే ఈ డీల్ కుదిరిందని చెప్పారు. వచ్చే నెలలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ అగ్రిమెంట్ కూడా కుదరనుందని అన్నారు.వాణిజ్య ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడం లేదని కేంద్రం స్పష్టంఅంతకుముందు అమెరికాతో గత నెలలో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని భారత్ నిలిపివేయనుందని ప్రచారం సాగింది. అయితే, అమెరికా ట్రేడ్ డీల్ రద్దు చేసుకోనున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పరస్పర ప్రయోజనాన్ని అందించే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా చర్చలు కొనసాగుతున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత నెలలో వాషింగ్టన్‌లో ఇరు దేశాలకు చెందిన ముఖ్య సంధానకర్తలు సమావేశం కావాల్సి ఉన్నా, టారిఫ్ రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో వాయిదా పడింది.

# ఫ్లిప్‌కార్ట్‌లో 'రూపాయికే లీటర్ పాలు'

### కర్ణాటకలో తీవ్ర దుమారం




ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన 'రూపాయికే లీటర్ పాలు' ఆఫర్ కర్ణాటకలో పెద్ద దుమారాన్ని రేపింది. ఈ చర్య రైతులను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ బెంగుళూరు మిల్క్ యూనియన్ లిమిటెడ్ (బమూల్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరతామని, అలాగే కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు (సీసీఐ) ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది.శనివారం బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ మీడియాతో మాట్లాడుతూ.. మార్కెట్‌ను చేజిక్కించుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ ఇలాంటి అనైతిక పోటీకి తెరలేపిందన్నారు. "డబ్బు సంపాదించాలనే ఆత్రుతతో ఫ్లిప్‌కార్ట్ లీటర్ పాలను రూపాయికే అమ్ముతోంది. ఇది రైతాంగాన్ని నాశనం చేసే చర్య. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న సహకార పాల యూనియన్లను బలహీనపరిచే కుట్ర ఇది అని ఆరోపించారు.ఈ పథకం కోసం ఫ్లిప్‌కార్ట్ సుమారు రూ. 2,000 కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 14.5 లక్షల లీటర్ల పాలను విక్రయించిందని సురేశ్ తెలిపారు. ఈ ఆఫర్ కారణంగా తమ యూనియన్ పాల అమ్మకాలు రోజుకు 40,000 నుంచి 50,000 లీటర్ల వరకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు లీటర్‌కు రూ. 38 నుంచి రూ. 40 చెల్లిస్తుంటే, రూపాయికే ఎలా అమ్ముతారని ఆయన ప్రశ్నించారు. ఫ్లిప్‌కార్ట్ ఎక్కడి నుంచి పాలను సేకరిస్తోందో తెలియదని, పాల నాణ్యతను పరీక్షించేందుకు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను ఫ్లిప్‌కార్ట్ వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# భారత్‌కు చమురు సప్లై ముప్పు పెరిగినా ఇండియన్ రిఫైనరీలకు లాభాలే

### మోర్గాన్ స్టాన్లీ భారత్‌కు చమురు సరఫరాపై మోర్గాన్ స్టాన్లీ నివేదిక

### చమురు సంక్షోభం కొనసాగితే, రిఫైనరీలకు ప్రయోజనమే వెల్లడి

### హర్మూజ్‌పై ఇరాన్‌తో భారత్ సంప్రదింపులు



రష్యా చమురు కొనుగోలులో వేగాన్ని పెంచిన భారత్ పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల భారత్‌కు చమురు సప్లై ముప్పు పెరిగినప్పటికీ, భారతీయ రిఫైనరీలకు ప్రయోజనమే చేకూరుతుందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు జరిగే చమురు సప్లైలకు అంతరాయం ఇలాగే కొనసాగితే, ఆ పరిణామం భారతీయ రిఫైనరీలకు కలిసొచ్చే అవకాశం ఉందని విశ్లేషించింది. ఈమేరకు వివరాలతో ఒక నివేదికను మోర్గాన్ స్టాన్లీ విడుదల చేసింది.ఆసియా దేశాలకు చమురు సప్లైలో అంతరాయాలు, ఎగుమతులకు ఆటంకాల వల్ల, ఆయా దేశాల్లోని రిఫైనింగ్ కంపెనీల లాభాలు పెరుగుతాయని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. అందుకే గత వారం వ్యవధిలో డీజిల్, జెట్ ఇంధనం, గ్యాసోలిన్, నాఫ్తా వంటి ఇంధనాల ధరలు సగటున 18 నుంచి 30 శాతం పెరిగాయని మోర్గాన్ స్టాన్లీ చెప్పింది. ఈ పెరుగుదల ఇంధన మార్కెట్‌లో ఏర్పడిన అనిశ్చితికి ప్రతిబింబం లాంటిదని అభివర్ణించింది.రిఫైనరీల లాభాలు 15 నుంచి 30 శాతం పెరగొచ్చు'చమురు సంక్షోభం ఇలాగే కొనసాగితే, రిఫైనరీల లాభదాయకత పెరుగుతుంది. ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలు, దేశాల నుంచి ముడి చమురును కొనే రిఫైనరీలు, ప్రత్యేకించి భారీ రిఫైనరీలు, ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీల లాభాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల నుంచి అవి ఆకర్షణీయమైన లాభాలను ఆర్జించే ఛాన్స్ ఉంది. ఒక బ్యారెల్ ముడి చమురు ధర కనీసం 1 డాలరు నుంచి 1.5 డాలరు మేరకు పెరిగినా రిఫైనరీల లాభాలు 2026లో 15 శాతం నుంచి 30 శాతం దాకా పెరగొచ్చు' అని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషించింది.భారత్ వినియోగించే చమురులో 46 శాతం ఆ దేశాలదే'భారత్ వినియోగించే ముడి చమురులో దాదాపు 46 శాతం పశ్చిమాసియా దేశాల నుంచే వస్తోంది. ప్రత్యేకించి ఈ చమురు నిల్వలన్నీ ఇరాన్ పరిధిలోని హర్మూజ్ జలసంధి మీదుగానే భారత్‌కు చేరుతున్నాయి. భారత్, చైనా వినియోగించే చమురు నిల్వల్లో 40 నుంచి 50 శాతం హర్మూజ్ మీదుగానే ఆయా దేశాలకు సప్లై అవుతున్నాయి. ఇంధన అవసరాల కోసం భారత్ ఎక్కువగా గల్ఫ్ దేశాలపైనే ఆధారపడుతోంది. హర్మూజ్ వద్ద నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు ప్రస్తుతానికి చమురు సప్లైలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి' అని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.30 నుంచి 200 రోజులకు సరిపడా చమురు నిల్వలు"ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరాల కోసం దాచి ఉంచిన వ్యూహాత్మక చమురు నిల్వలు, ప్రత్యామ్నాయ చమురు సమీకరణ మార్గాలు పనికొస్తాయి. వీటి సహకారంతో తాత్కాలికంగా ఇంధన అవసరాలను తీర్చుకోవచ్చు. ఇప్పుడు ఆసియా పసిఫిక్ దేశాల వద్ద దాదాపు 30 రోజుల నుంచి 200 రోజులకు సరిపడా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. ఈ తరుణంలో భారత్ సహా చాలా ఆసియా దేశాలు ప్రత్యామ్నాయ చమురు సమీకరణ మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈక్రమంలోనే చౌక ధరకు రష్యా విక్రయిస్తున్న ఉరల్స్ ముడి చమురును వీలైనంత ఎక్కువ మోతాదులో కొనే యత్నాల్లో భారత్ నిమగ్నమైంది. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా 30 రోజుల పాటు ఆంక్షలను ఎత్తివేయడం భారత్‌కు కలిసొచ్చే అంశం"మోర్గాన్ స్టాన్లీ, ప్రముఖ ఆర్థిక సేవల సంస్థహర్మూజ్‌పై ఇరాన్‌తో భారత్ సంప్రదింపులు'ఇక ఇదే సమయంలో ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలనూ భారత్ వెతుకుతోంది. హర్మూజ్ జలసంధి మీదుగా ఎల్‌పీజీ, ముడి చమురుతో కూడిన భారతీయ ట్యాంకర్ల రాకపోకలకు అనుమతి ఇవ్వాలనే అంశంపై ఇరాన్‌తోనూ భారత్ చర్చలు జరుపుతోంది. కనీసం 20 భారతీయ ట్యాంకర్లకైనా హర్మూజ్‌ను దాటే ఛాన్స్ ఇవ్వాలని ఇరాన్‌ను ఇండియా అడుగుతోంది' అని మోర్గాన్ స్టాన్లీ వెల్లడించింది.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్

### భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. గత మూడు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల జోరు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. ముఖ్యంగా ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లు మార్కెట్‌కు అండగా నిలిచాయి.సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 939 పాయింట్లు (1.26 శాతం) లాభపడి 75,502.85 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 257.70 పాయింట్లు (1.11 శాతం) పెరిగి 23,408.80 వద్ద ముగిసింది. అయితే, ప్రధాన సూచీలు లాభపడినా బ్రాడర్ మార్కెట్లలో బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.43 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.65 శాతం నష్టపోయాయి.మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,200-23,100 స్థాయిల వద్ద ఉంది. కీలక నిరోధం 23,500 వద్ద కొనసాగుతోందని, ఈ స్థాయిని దాటితే నిఫ్టీ 23,800 వరకు వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఒకవేళ 23,400-23,500 శ్రేణిలో నిలదొక్కుకోలేకపోతే మార్కెట్ మళ్లీ కన్సాలిడేట్ కావచ్చని విశ్లేషకులు పేర్కొన్నారు.సెన్సెక్స్ షేర్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, టాటా స్టీల్ అత్యధికంగా లాభపడగా.. సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ రియల్టీ సూచీ బలహీనంగా ముగిసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదల వంటి కారణాలతో మార్కెట్లో ఒడిదొడుకులు కనిపించాయని నిపుణులు తెలిపారు.

# జుకర్‌బర్గ్ సంచలన నిర్ణయం.. 16,000 మంది ఉద్యోగులపై వేటు



సోషల్ మీడియా దిగ్గజం మెటాలో మరోసారి ఉద్యోగాల కోతకు రంగం సిద్ధమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో దూసుకెళ్లేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్న సంస్థ.. ఖర్చులను తగ్గించుకునేందుకు ఏకంగా 20 శాతం మంది సిబ్బందిని తొలగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై తుది నిర్ణయం, కచ్చితమైన తేదీ ఇంకా ఖరారు కాలేదు.కంపెనీ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ గత కొంతకాలంగా జనరేటివ్ ఏఐపై పూర్తిగా దృష్టి సారించారు. దీని కోసం పరిశోధకులకు భారీ ప్యాకేజీలు ఇవ్వడంతో పాటు డేటా సెంటర్ల నిర్మాణానికి బిలియన్ల డాలర్లు వెచ్చిస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న వ్యయాలను నియంత్రించేందుకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. "గతంలో పెద్ద బృందం చేసే పనిని, ఇప్పుడు ఏఐ సాయంతో ఒక ప్రతిభావంతుడైన వ్యక్తి చేయగలడు" అని జుకర్‌బర్గ్ ఇటీవలే వ్యాఖ్యానించడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.డిసెంబర్ 31 నాటికి మెటాలో సుమారు 79,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ప్రణాళిక అమలైతే దాదాపు 16,000 మంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికే 2022లో 11,000 మందిని, 2023లో 10,000 మందిని మెటా తొలగించింది. ఈసారి జరగబోయే తొలగింపులు సంస్థ చరిత్రలోనే కీలకమైనవిగా మారనున్నాయి.కేవలం మెటా మాత్రమే కాదు, ఇతర టెక్ కంపెనీలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. ఈ ఏడాది అమెజాన్ 16,000 మందిని తొలగించగా, 'బ్లాక్' అనే ఫిన్‌టెక్ సంస్థ కూడా ఏఐ వినియోగం పెరగడంతో సిబ్బందిని తగ్గించుకుంది. ఏఐ టెక్నాలజీ రాకతో తక్కువ సిబ్బందితోనే అధిక ఫలితాలు సాధించవచ్చని కంపెనీలు భావిస్తుండటమే ఈ లేఆఫ్స్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

# టెక్కీలపై ఎల్పీజీ కొరత ప్రభావం

### క్యాంటీన్లు మూసివేస్తున్న కంపెనీలు






దేశంలోని ప్రముఖ ఐటీ కంపెనీలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్ తమ ఉద్యోగులకు కీలక సూచనలు జారీ చేశాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడటంతో, క్యాంటీన్లలో సేవలను పరిమితం చేస్తున్నామని, ఉద్యోగులు తమ భోజనాన్ని ఇళ్ల నుంచే తెచ్చుకోవాలని కోరుతున్నాయి.పుణె, బెంగళూరు, చెన్నైలోని పలు ఐటీ క్యాంపస్‌లలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కంపెనీలు తమ క్యాంటీన్లలో మెనూలను భారీగా తగ్గించాయి. దోశ, ఆమ్లెట్ వంటివి అందించే లైవ్ ఫుడ్ కౌంటర్లను తాత్కాలికంగా మూసివేశాయి. టీసీఎస్ యరవాడ క్యాంపస్‌లో కేవలం పప్పు-అన్నం వంటి ప్రాథమిక భోజనాన్ని మాత్రమే అందిస్తుండగా, విప్రో క్యాంపస్‌లోనూ ఫాస్ట్ ఫుడ్ కౌంటర్లను నిలిపివేశారు.పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ దిగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాలకు అధిక ప్రాధాన్యమిస్తూ, వాణిజ్యపరమైన కార్యకలాపాలకు ఎల్పీజీ సరఫరాను నియంత్రించాలని నిర్ణయించింది. ఈ అధికారిక ఉత్తర్వుల కారణంగానే ఐటీ కంపెనీల్లోని క్యాంటీన్ నిర్వాహకులకు గ్యాస్ సరఫరా తగ్గింది. కంపెనీల నిర్ణయంతో ఉద్యోగులు, ముఖ్యంగా పీజీలు, హాస్టళ్లలో ఉంటూ బయటి ఆహారంపై ఆధారపడేవారు ఇబ్బందులు పడుతున్నారు.

# ఆడి బాటలోనే మెర్సిడెస్ బెంజ్ భారత్ లో పెరగనున్న కార్ల ధరలు







ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి అన్ని మోడళ్లపై సుమారు 2 శాతం మేర ధరలు పెరగనున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విదేశీ మారకద్రవ్యంలో అస్థిరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఈ విషయంపై కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ బ్రెండన్ సిసింగ్ మాట్లాడుతూ.. "ముఖ్యంగా యూరోతో పోలిస్తే భారత రూపాయి విలువ తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. వ్యాపార సుస్థిరత కోసం ఈ ధరల సవరణ తప్పనిసరి అయింది. ఏప్రిల్ 1 నుంచి మా పోర్ట్‌ఫోలియో అంతటా సుమారు 2 శాతం ధరల పెంపును అమలు చేస్తున్నాం" అని తెలిపారు. అయితే, ఈ పెంపు ప్రభావం వినియోగదారులపై వీలైనంత తక్కువగా ఉండేలా చూస్తామని, అత్యుత్తమ ఉత్పత్తులు, సేవలు అందించడంపై తమ దృష్టి కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు.ఇదిలా ఉండగా, మరో జర్మన్ లగ్జరీ కార్ల సంస్థ ఆడి ఇండియా ఇప్పటికే ధరల పెంపు నిర్ణయం తీసుకుంది. తమ కార్ల ధరలను ఏప్రిల్ 1 నుంచి 2 శాతం వరకు పెంచుతున్నట్లు ఈ వారంలోనే ప్రకటించింది. ముడిసరుకుల ధరలు, కరెన్సీ రేట్లలో మార్పులే ఇందుకు కారణమని ఆడి కూడా స్పష్టం చేసింది. దీంతో ఏప్రిల్ నుంచి రెండు ప్రధాన జర్మన్ లగ్జరీ కార్ల బ్రాండ్ల ధరలు పెరగనున్నాయి.




# “విశ్వనాథ్ - సన్స్” టీజర్ రిలీజ్

## షూటర్ జీవితంతో ప్రేమకథ కలిపి వెంకీ అట్లూరి కొత్త ప్రయోగం

సౌత్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం “విశ్వనాథ్ ఽ సన్స్” పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ కమర్షియల్ సినిమా కాకుండా భావోద్వేగాలతో నిండిన స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఓ షూటర్ స్పోర్ట్స్ పర్సన్ జీవితాన్ని, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత జీవితం చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు. ఇందులో హీరో పాత్రకు గాఢమైన భావోద్వేగాలు, జీవితంలో ఎదురైన పోరాటాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి అమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హీరో 40 ఏళ్ల వయసులో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు చాలా హృద్యంగా చూపించబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ అంశం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. టీజర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో జరిగే సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంతో రూపొందించిన సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. వెంకీ అట్లూరి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా భావోద్వేగాలను ప్రధానంగా చూపించబోతున్నట్టు టీజర్ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. మేకర్స్ ఇప్పటికే ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. స్పోర్ట్స్, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కుతున్న “విశ్వనాథ్ ఽ సన్స్” సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందా అనేది చూడాలి. టీజర్ మాత్రం సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేసింది.

## త్వరలోనే రిలీజ్

హీరో కిరణ్ అబ్బవరం కేఏ ప్రొడక్షన్స్, సుమైర స్టూడియోస్ నిర్మిస్తున్న”తిమ్మరాజుపల్లి టీవీ” మూవీ నుంచి ‘ఊరు సాంగ్’ రిలీజ్ న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా “తిమ్మరాజుపల్లి టీవీ”. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. “తిమ్మరాజుపల్లి టీవీ” చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు “తిమ్మరాజుపల్లి టీవీ” సినిమా నుంచి ‘ఊరు సాంగ్’ రిలీజ్ చేశారు. వంశీకాంత్ రేఖన బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించారు. మమత రమేష్ పాడారు. ‘ఊరు సాంగ్’ ఎలా ఉందో చూస్తే – ‘కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ, ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ, ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగ, గడపల తోరణాలే గంతులు వేసెనుగా, పువులా పరిమళాలే గాలులు వీచెనుగా, ముస్తాభవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు, చిన్నా పెద్దల్లోన మొదలయ్యేను జాతర జోరు..’అంటూ ఆహ్లాదకరమైన పల్లెటూరిలో జరిగే శివరాత్రి జాతర సందడిని, ఆ పండక్కి ఊరు ప్రజలంతా సన్నద్ధమయ్యే తీరును వర్ణిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.





## ఉగాది కానుక ఉస్తాద్ భగత్ సింగ్’

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతుండగా, తాజాగా నిర్వహించిన గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది.ఇదిలా ఉండగా, విదేశీ మార్కెట్‌లో ముఖ్యంగా యూఎస్‌లో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ మంచి స్పందనను అందుకుంటున్నాయి. ఇటీవలే ఈ చిత్రం 2 లక్షల డాలర్ల మార్క్‌ను దాటినట్లు సమాచారం. తాజాగా మరో మైలురాయిని అందుకుంటూ 10 వేలకుపైగా టికెట్లు విక్రయించబడినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ మార్కెట్‌లో ఈ స్థాయి బుకింగ్స్ రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ప్రస్తుతం కూడా బుకింగ్స్ స్థిరంగా కొనసాగుతున్నాయి. రిలీజ్‌కు ఇంకా కొన్ని రోజులు ఉండటంతో, వచ్చే రోజుల్లో బుకింగ్స్ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, హరీష్ శంకర్ మార్క్ కమర్షియల్ టచ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. ఇక సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. ఉగాది సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో వస్తున్న అడ్వాన్స్ బుకింగ్స్ ఈ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇప్పుడు రిలీజ్‌కు ముందు రోజుల్లో ఈ బుకింగ్స్ ఎంతవరకు పెరుగుతాయో చూడాలి.

## ఫస్ట్ డే షూట్‌లో పవన్ కళ్యాణ్ నన్ను అడిగిన ప్రశ్న అదే

### ఉస్తాద్ భగత్ సింగ్ బ్యూటీ రాశీఖన్నా

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా రాశీఖన్నా మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. పవన్ కళ్యాణ్ సినిమా అని తెలియగానే చాలా ఎక్జయిట్‌మెంట్‌తో కథ వినకముందే సినిమాకు ఒకే చెప్పానంది రాశీఖన్నా. నా తొలి సినిమా నుంచి పవన్ కళ్యాణ్ స్టార్‌డమ్ గురించి, పవనిజం గురించి చాలా వింటున్నా. అప్పటి నుంచి ఆయనతో ఒక్కసారైనా నటించాలని అనుకునేదాన్ని. ఉస్తాద్ భగత్ సింగ్‌తో నా కల నెరవేరింది. ఇందులో నేను శ్లోక అనే మోడ్రన్ యువతి పాత్రలో కనిపిస్తా. నాతోపాటు ప్రతీ పాత్ర కథలో చాలా ప్రాధాన్యత ఉంటుంది.ఇందులో నేను మాస్ సాంగ్‌లో కనిపిస్తా. ఆ పాటకు డ్యాన్స్ చేయడాన్ని, షూటింగ్‌ను చాలా బాగా ఎంజాయ్ చేశానంటూ చెప్పుకొచ్చింది. పవన్ కళ్యాణ్ సాదాసీదాగా ఉండే వ్యక్తి. ఎప్పుడూ బుక్స్ చదువుతుంటారు. ఆయన తొలి రోజు షూటింగ్‌లో మీరు నటి అవ్వాలనుకున్నారా..? అని నన్ను అడిగారు. నిజానికి తాను ఐఏఎస్ ఆఫీసర్ అవుదామనుకున్నానని ఆయనతో చెప్పాను. పవన్ కళ్యాణ్ తక్కువగా మాట్లాడుతారు.. కానీ ఆయన ప్రతీ మాటకు ఒక విలువ ఉంటుంది. ఆయన ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారంది రాశీఖన్నా. హరీష్ శంకర్‌కు మాస్ ఆడియెన్స్ పల్స్ చాలా బాగా తెలుసు. నిద్ర లేకుండా అవిశ్రాంతంగా సినిమా కోసం పనిచేశారు. 120 రోజుల్లో చేయాల్సిన షూటింగ్‌ను 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సెట్స్‌లో తరచూ పంచ్ డైలాగ్స్ రాసేవారు. ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పింది రాశీఖన్నా. ఇప్పుడీ కామెంట్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ మూవీలో పార్థిబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.